# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 27-6-2025 15/-










గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in
**Our Bank A/c Details:**
Geeturai Weekly, A/c No.1042789768
IFSC : CBIN0282407, Central Bank of India
Noor Khan Bazar Branch, Hyderabad

సంపుటి: 47 సంచిక: 25 హైదరాబాద్
శుక్రవారం 27 జూన్ 2025 రూ.15-00
1 ముహర్రమ్ 1447 హిజ్రీ

## తొలిగీటు

'నువ్వు ఎక్కడ, ఏ స్థితిలో ఉన్నా, దైవానికి భయపడుతూ ఉండు. ప్రతి తప్పిదంతో పాటు సత్కార్యం కూడా చేయి. అది దాన్ని చెరిపేస్తుంది. దైవదాసులైన మానవులతో సత్ప్రవర్తన కలిగివుండు.'

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




26 కథ

**పేదల ఇంట పండుగ**

## లోపల...

అవార్డు కథ ...... 04
మండుతున్న మధ్య ప్రాచ్యం ...... 05
మధ్య ప్రాచ్యంలో యుద్ధ మేఘాలు ...... 08
చరితార్థులు-2 : నియామతుల్లా అన్సారి ...... 11
మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ (రజి) - 3 ...... 12
ఇస్లాం విశ్వాస వ్యవస్థ ...... 14
వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) ...... 18
అడుగుజాడలు (సహీహ్ బుఖారీ అనువాదం) ...... 19
ప్రణాళికాబద్ధమైన జీవితం ...... 22
విద్య వెలుగు ...... 24
శ్రేయోభిలాషా! నీ పేరే ఇస్లామ్-2 ...... 28
టీ తాగాల్సిందే? (కవిత) ...... 31
సంక్షిప్త భారతం ...... 32
సర్వత్రా ...... 33
ధర్మజ్ఞానం విలువ ...... 34

### కాషాయ కాంగ్రెస్ ...




రజాకార్ సినిమాకు
ఇచ్చినరట అవార్డు
ముస్లింలే టార్గెట్టట
అందుకంట రివార్డు!
భాజపా నారుపోస్తే
నీరు పోసి రేవంతు
గద్దరన్న ఆత్మశాంతి
చేశాడట తనవంతు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# అవార్డు కథ

రజాకార్ సినిమా గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ సినిమాలో ఏం చూపించారో కూడా ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమా పోస్టర్ విడుదలైనప్పుడే పోస్టర్‌పై చిత్రం గురించి రావలసిన ప్రశ్నలు వచ్చేశాయి. ప్రాపగాండ చిత్రాల పొడవైన జాబితాలో ఇది ఒకటని పలువురు ఇప్పటికే సమీక్షలు రాశారు

బీజేపీ నాయకుడు నిర్మాతగా తీసిన చిత్రం ఇది. సెప్టెంబర్ 1948కి ముందు హైదరాబాదు సంస్థానంలో హిందువులపై ముస్లిములు దాడులు, దౌర్జన్యాలు జరిపారని చూపిస్తూ, హిందూ ముస్లిం చిచ్చుపెట్టే విధంగా తీసిన సినిమా ఇది.

తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ముహబ్బత్ కీ దుకాన్ ప్రచారం చేసే రాహుల్ గాంధీ సారథ్యంలో నడుస్తున్న సెక్యులర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ అవార్డును ఈ చిత్రానికి ప్రదానం చేయడం కాస్త ఆశ్చర్యమే.

గద్దర్ గురించి అందరికీ తెలుసు. తెలంగాణ రాష్ట్రసాధన కోసం పోరాడిన గద్దర్ రాజకీయ భావజాలం ఎలాంటిదో కూడా అందరికీ తెలుసు. వామపక్ష భావజాలానికి గద్దర్‌కు ఎంత దగ్గరి సంబంధం ఉందో కూడా అందరికీ తెలుసు. రజాకార్ సినిమా ఎలాంటి భావజాలాన్ని ప్రచారం చేస్తుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కాంగ్రెస్ తనను సెక్యులర్ పార్టీగా ప్రచారం చేసుకుంటున్న పార్టీ. గద్దర్ పేరున ఇస్తున్న అవార్డును, రజాకార్ వంటి చిత్రానికి ఇవ్వడం చాలా మందికి మింగుడుపడడం లేదు. ఈ విషయమై మజ్లిస్ పార్టీ కూడా పెద్దగా విమర్శించకపోవడం మరో ఆశ్చర్యం.

రజాకార్ సినిమాకు ఈ అవార్డు ఇస్తే అభ్యంతరమేమిటి? అనే ప్రశ్న సహజంగానే కొందరు తెలిసో తెలియకో అడగొచ్చు. ముస్లిం విద్వేష ప్రాపగాండ ఈ సినిమా లక్ష్యం. చరిత్రను వక్రీకరించడం కూడా ఇందులో జరిగింది.

హైదరాబాదు సంస్థానం అంటే తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్నాటకలోని ప్రాంతాలు కూడా కలిసి ఉన్న పెద్ద సంస్థానంగా ఉండేది. నిజానికి 1946కు ముందు నుంచి తెలంగాణ రైతులు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో భూస్వాముల దౌర్జన్యాలపై ఉద్యమించడం ప్రారంభించారు. జాగీరుదారులు, దేశ్‌ముఖ్‌లు, జమీందారుల వద్ద బడుగు బలహీనవర్గాలు వెట్టి చాకిరి చేసే పరిస్థితులు ఉండేవి. ఈ జాగీరుదారుల్లో చాలా మంది ముస్లిములు కాదు.

రజాకార్లు చేసిన దుర్మార్గాలు చాలా ఉన్నాయన్నది నిర్వివాదాంశం. షోయబుల్లా ఖాన్ నిర్భయంగా వారిని వ్యతిరేకించి హత్యకు గురయ్యాడు. తెలంగాణ ప్రముఖ కవి మక్దూం సాయుధపోరాట నేతల్లో ఒకరు.

ఈ చరిత్ర చిత్రంలో కనిపించడం లేదని విశ్లేషకులు పలువురు విమర్శించారు. రజాకార్ల దౌర్జన్యాలను మాత్రమే ఈ చిత్రం చూపించింది తప్ప ప్రజాప్రతిఘటనలో పాల్గొన్న వివిధ సముదాయాల వాస్తవ చరిత్రను చిత్రీకరించలేదు. బీజేపీ విమోచన దినం పాటించాలని చేస్తున్న డిమాండ్ వెనుక కూడా ఈ విద్వేష రాజకీయాలే ఉన్నాయి. అంటే ముస్లిముల నుంచి విమోచన అని ప్రజలకు చెప్పాలనుకుంటున్నారు. కాని వాస్తవమేమిటంటే, నిజాం ఉస్మాన్ అలీ ఖాన్ 1948 తర్వాత కూడా జీవించి ఉన్నంత కాలం, అంటే 1967 వరకు రాజ్ ప్రముఖ్ (గవర్నర్) హోదాలోనే కొనసాగారు. ఈ చిత్రం చెప్పేదేమిటంటే ముస్లిం పాలకుడు, ముస్లిములు దుర్మార్గంగా హిందువులను అణిచేశారని చిత్రీకరిస్తుంది. ఫ్యూడల్ వ్యవస్థ దుర్మార్గాలు, బడుగు బలహీనవర్గాలపై అణచివేతల ప్రస్తావన లేదని పలువురు విశ్లేషకులు విమర్శించారు.

ముహబ్బత్ కి దుకాన్ ప్రచారం చేసే కాంగ్రెసు ప్రభుత్వం ఇచ్చిన అవార్డు ఇది. చాలా మంది కాంగ్రెసు వాదులకే ఇది మింగుడుపడడం లేదంటే తప్పులేదు.

అబ్దుల్ వాహెద్

# మండుతున్న మధ్యప్రాచ్యం



**ఈరాన్ ఇస్రాయీల్** మధ్య మొదలైన యుద్ధం మధ్యప్రాచ్యంలో ఇతర ఘర్షణల వంటిది కాదు. ఇప్పుడు అణ్వస్త్ర పోటీ కొత్తదశలోకి ప్రవేశించడానికి ఇది నాందివాచకం. ప్రపంచంలో అణ్వస్త్రాల కోసం ఇతర దేశాలు కూడా ప్రయత్నించక తప్పని పరిస్థితులు ఏర్పడేలా చేసిందీ యుద్ధం.

ఈరాన్ వద్ద అణ్వస్త్రాలు ఉంటే ఇస్రాయీల్ ఇంత దుడుకుగా దాడులకు పాల్పడేదా? అనే ప్రశ్న అనేకమంది విశ్లేషకులు ఇప్పుడు అడుగుతున్నారు.

జూన్ 13వ తేదీన ఇస్రాయీల్ దుందుడుకుగా ఈరాన్‌పై దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఈరాన్ భారీగా నష్టపోయిందన్నది వాస్తవం. కాని కేవలం కొన్ని గంటల్లోనే పుంజుకున్న ఈరాన్ భారీస్థాయిలో ప్రతిదాడులకు దిగడం ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇస్రాయీల్ దాడి తర్వాత ఈరాన్ ను బెదిరిస్తున్నట్లు ట్వీటు చేసిన అమెరికా అధ్యక్షుడు కూడా ఆ తర్వాత యుద్ధవిరమణ జరగాలన్నట్లు ట్వీటు చేయడం గమనార్హమైనది.

ఈ యుద్ధం సాధారణమైనది కాదు. ఇస్రాయీల్ వద్ద అణ్వస్త్రాలున్నాయి. అణ్వాయుధాలున్న ఒక దేశం, అణ్వాయుధాలు సంపాదించుకునే దశలో ఉన్న మరో దేశాన్ని అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకోడానికి చేసిన దాడిగా చిత్రీకరించబడుతున్న యుద్ధమిది. రెండు దేశాలు మిస్సయిళ్ళ వర్షం కురిపిస్తున్నాయి. ఇరు దేశాల్లోను ప్రాణనష్టం భారీగానే ఉందని అంచనాలు వినిపిస్తున్నాయి.

ఈరాన్ ఇస్రాయీల్ యుద్ధంలో గమనించవలసిన విషయమేమిటంటే, అణ్వాయుధాలున్నాయన్న విషయాన్ని ఈ రెండు దేశాల్లో ఏ దేశమూ బహిరంగంగా చెప్పుకోలేదు. ఇండియా, పాకిస్తాన్ పరిస్థితి అలాంటిది కాదు. ఈ రెండు దేశాలు బాహాటంగా తమ వద్ద ఉన్న అణ్వాయుధాల గురించి ప్రకటించాయి. కాని ఇస్రాయీల్ తన వద్ద అణ్వాయుధాలున్నాయని చెప్పడం లేదు. ఈరాన్ అణ్వాయుధాలు తయారు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు కూడా చెప్పుకోవడం లేదు. దీనివల్ల పరిస్థితి మరింత జటిలమవుతోంది. అణ్వాయుధాలు లేనిదే ఇస్రాయీల్ దుందుడుకు చేష్టలను అడ్డుకోవడం సాధ్యపడదని ఈరాన్ భావిస్తోంది. గాజాలో జరిగిందిదే. గాజా వంటి బలహీన ప్రాంతాన్ని ఇస్రాయీల్ ధ్వంసం చేసింది. అక్కడ పసిపిల్లలను కూడా చంపేసింది. క్షతగాత్రులకు మందులు కూడా లభించకుండా అడ్డుకుంటోంది. మరోవైపు ఈరాన్ అణ్వస్త్రాలు సంపాదించకుండా అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్న అమెరికా, ఇస్రాయీల్ ప్రయత్నాలు ఈరాన్ వేగాన్ని తగ్గిస్తాయేమో కాని పూర్తిగా ఆపలేవని విశ్లేషణలు వస్తున్నాయి. ఈరాన్‌పై దాడులు చేయడం ద్వారా అక్కడి ప్రజల్లో తిరుగుబాటు తీసుకువచ్చి ప్రభుత్వాన్ని కూల్చాలన్నది ఇస్రాయీల్ ఆలోచన.

ఇస్రాయీల్ దాడిని ఈరాన్ యుద్ధప్రకటనగా పరిగణిస్తున్నట్లు చెప్పింది. ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగినా వెనుకడుగు వేసేది లేదని ప్రకటించింది.

గత మూడు దశాబ్దాలుగా ఇస్రాయీల్ ప్రధాని నెతన్యాహు చెబుతున్నది ఒక్కటే మాట. ఈరాన్ చాలా తొందరగా అణ్వస్త్రాలు

తయారు చేసి ప్రపంచశాంతికి ప్రమాదంగా మారిపోతుందని బెదిరించడం. కాని ఈ మూడు దశాబ్దాల్లో ఈరాన్ వద్ద అణ్వస్త్రాల తయారీ పూర్తి కాలేదు.

ఈ యుద్ధానికి ముందు చాలా మంది అమెరికా, ఈరాన్‌ల మధ్య అణు ఒప్పందం కుదురుతుందని భావించారు. కాని అకస్మాత్తుగా ఇస్రాయీల్ దాడి చేసింది. చర్చల పేరుతో అమెరికా మోసపుచ్చి ఈ దాడులకు తోడ్పడిందని కొందరి అభిప్రాయమైతే, ఈ దాడులు చేయడం ద్వారా చర్చలు జరక్కుండా ఇస్రాయీల్ అడ్డుకుందని మరి కొందరి అభిప్రాయం. ఈ దాడుల గురించి తనకు ముందే తెలుసన్నట్లు ట్రంప్ మాట్లాడారు. అంతేకాదు, చర్చల్లో పాల్గొన్నవారికి చనిపోయారు కదా అన్న మాట కూడా చెప్పాడు. చర్చల పట్ల అమెరికా చిత్తశుద్ధి ఇప్పుడు సందేహాస్పదమైపోయింది.

అంతర్జాతీయ అణుసంస్థ ఇస్రాయీల్ కోసం గూఢచర్యం చేస్తుందన్నట్లు ఈరాన్ మాట్లాడుతుంది. ఈరాన్ అణు కార్యకలాపాలు దాచి పెడుతుందని అంతర్జాతీయ అణుసంస్థ ఆరోపిస్తుంది.

వివరాల్లోకి వెళితే ఈరాన్ అణుకార్యక్రమం 1957లో ప్రారంభమయ్యింది. అప్పుడు అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్. అప్పట్లో నిజానికి అమెరికాయే ఈ కార్యక్రమానికి ఊతమిచ్చింది. కాని అప్పుడు ఈరాన్‌లో పహెల్వీల రాజరికపు పాలన ఉంది. పహెల్వీలు అమెరికాకు ఆప్తమిత్రులుగా ఉండేవారు. అప్పట్లో ఇస్రాయీల్, ఈరాన్ మధ్య కూడా స్నేహం ఉంది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేక కూటమిలో ఈరాన్ ఉండేది. 1970లో ఈరాన్ అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేసింది.

అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం ప్రపంచంలో కేవలం 5 దేశాలకు మాత్రమే అణ్వాయుధాల దేశాలుగా గుర్తింపు ఇస్తుంది కాబట్టి ఇది వివక్షాపూరితమైనదని భారతదేశం ఇందులో చేరలేదు.

తర్వాత ఈరాన్ లో పరిస్థితులు మారాయి. ప్రజాతిరుగుబాటు జరిగింది. ఆయతుల్లా ఖొమైనీ నాయకత్వంలో 1979లో జరిగిన తిరుగుబాటు తర్వాత పహెల్వీ రాజరిక ప్రభుత్వం కూలిపోయింది. ఆ తర్వాతి నుంచి అమెరికాతో ఈరాన్‌కు సంబంధాలు లేవు. ఇరు దేశాల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు కొనసాగుతూ వస్తున్నాయి. చాలా సందర్భాల్లో అమెరికా దాడి చేస్తుందన్న వార్తలు కూడా వచ్చాయి.

అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ హయాంలో 40 మంది అమెరికా దౌత్య సిబ్బందిని ఈరాన్ బందీలుగా ఉంచటం, వారిని విడిపించుకోబోయిన అమెరికా సైనిక విమానాన్ని ఈరాన్ తరిమికొట్టడం తెలిసిందే. ఆ తరువాత కొంత కాలానికి సమావేశమై ఉన్న మంత్రిమండలితో సహా 70 మంది అత్యున్నత శ్రేణి ఈరాన్ అధికారులను అమెరికా కుట్రపూరితంగా చంపించింది. ఈ విధంగా ఇరు దేశాల మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఆపైన అమెరికా అటు సద్దాంకు, ఇటు సఊదీ అరేబియాకు వెన్నుదన్నుగా నిలిచి ఈరాక్‌కి –ఈరాన్‌కి మధ్య ఎనిమిదేళ్లు యుద్ధం చేయించి, ఆర్థికంగా వాటి నడ్డి విరిచింది.

2000 తర్వాతి నుంచి ఈరాన్ అణుకార్యక్రమాలు ఉధృతం చేసింది. ఇటు అమెరికా యుద్ధాలు కూడా ఆ కాలంలో గమనించదగినవి. ట్విన్ టవర్ల దాడి తర్వాత అఫ్గనిస్తాన్‌పై జనహనన రసాయినక ఆయుధాలున్నాయన్న నెపంతో ఇరాక్‌పై దాడులు చేసింది. ఇరాక్‌లో అలాంటి ఆయుధాలు ఏవీ దొరకలేదు. ఈ నేపథ్యంలో ఈరాన్‌తో కూడా ఉద్రిక్తతలు పెరిగాయి. 2004లో ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్లతో పారిస్ ఒప్పందంపై ఈరాన్ సంతకం చేసింది. యురేనియం శుద్ధి కార్యక్రమాలు ఆపేస్తానని చెప్పింది. అయితే ఆ తర్వాత అహ్మదీ నెజాద్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు అమెరికా, ఈరాన్ మధ్య సంబంధాలు మరింత దిగజారాయి. ఈరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తోందని అమెరికా ఆరోపిస్తే, శాంతియుత ప్రయోజనాల స్థాయిలో అణు కార్యక్రమాలకు అణ్వస్త్ర నిరోధక ఒప్పందం అడ్డంకి కాదని ఈరాన్ వాదించింది. ఆ పిదప 2015లో ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చైనా, ఫ్రాన్సు, బ్రిటన్, రష్యా, జర్మనీలతో కలిసి అమెరికా అణుఒప్పందానికి ఈరాన్‌ను ఒప్పించింది. ఈరాన్ కూడా ఈ ఒప్పందంపై సంతకం చేసింది. ఆ తర్వాత ఈరాన్‌పై ఆంక్షలు ఎత్తివేశారు. అప్పటి అధ్యక్షుడు రూహానీ, విదేశాంగ మంత్రి జారిఫ్‌ల ప్రజాదరణ కూడా పెరిగింది. ఈ ఒప్పందం వల్ల 25 వేల పౌండ్ల శుద్ధి చేసిన యురేనియంను ఈరాన్ నుంచి తొలగించారు. ఈరాన్‌లోని అణుశుద్ధి సెంట్రీఫ్యూజుల్లో మూడింట రెండు వంతులు తగ్గించేశారు. తమ అణుకార్యక్రమాల అంతర్జాతీయ నిఘాకు ఈరాన్ కూడా ఒప్పుకుంది. ఈ ఒప్పందానికి ఈరాన్ ఒప్పుకో నట్లయితే ఈ పాటికి ఈరాన్ వద్ద అణుబాంబులు ఉండేవని విశ్లేషకుల అంచనా.

కాని 2018లో ట్రంప్ అధికారంలోకి వచ్చాడు. ఆయన ఏకపక్షంగా ఈ ఒప్పందాన్ని రద్దు చేశాడు. అంతర్జాతీయంగా ట్రంప్ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. కాని ట్రంప్ ఒప్పందాన్ని రద్దు చేసుకుని మళ్లీ ఈరాన్‌పై ఆంక్షలు విధించాడు. ఆ తర్వాత 2020లో ఈరాన్ సైన్యాధికారి ఖాసీం సులేమానీ హత్య జరిగింది. అమెరికా ఈ హత్య చేయించిందని ఆరోపణ.

ఖాసీం సులైమానీ చాలా ప్రముఖ సైన్యాధికారి. సిరియాలో అలావైట్, లెబనాన్‌లో హిజ్బుల్లా, గాజాలో హమాస్, ఇరాక్‌లో మిలిషియా, ఎమన్‌లో హూతీలు బలపడడానికి కారణం ఆయనే. ఈరాన్ మిస్సయిళ్ళ కార్యక్రమానికి కూడా ఆయనే కారణం. ఈ హత్య తర్వాత అమెరికాతో ఈరాన్ సంబంధాలు పూర్తిగా అడుగంటాయి. ఈ హత్య తర్వాత అణుఒప్పందం కుదిరే సూచనలు అదృశ్యమయ్యాయి. ఈరాన్ కూడా తన అణుకార్యక్రమాల వేగం పెంచింది.

ఈ హత్యకు ప్రతీకారంగా ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై ఈరాన్

దాడులు చేసింది. ఈ ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. కాని ఇటీవల మళ్ళీ అణుఒప్పందం గురించి వార్తలు, చర్చలు తెరపైకి వచ్చాయి. ఈరాన్ కూడా సానుకూలంగా స్పందించింది. ఈ నేపథ్యంలో హఠాత్తుగా ఇస్రాయీల్ దాడికి పాల్పడి మధ్యప్రాచ్యాన్ని పెనుమంటల్లోకి నెట్టింది.

ఈరాన్ అణ్వాయుధాలు తయారు చేయకుండా అడ్డుకోడానికే ఈ దాడి చేసినట్లు ఇస్రాయీల్ చెబుతోంది. చర్చల పేరుతో ఒకవైపు అమెరికా మాట్లాడుతుంటే మరోవైపు ఇస్రాయీల్ ఈ దాడికి పాల్పడింది. ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తే గతంలో ఇరాక్‌పై జనహనన రసాయినిక ఆయుధాలు అనే గగ్గోలు లేపి చేసిన దాడులు గుర్తుకువస్తున్నాయి.

ఇప్పుడు ఇస్రాయీల్ చెబుతున్న మాటలు – ఈరాన్ త్వరలోనే అణ్వాయుధాలు తయారు చేసేస్తుందన్న మాటలు – నిజమైతే అమెరికా ఇంటెలిజెన్స్ అత్యంత అసమర్థులని భావించాలి. ఎందుకంటే, మార్చి నెల వరకు అమెరికా ఇంటెలిజెన్స్ ప్రకారం ఈరాన్ నుంచి ఇప్పుడప్పుడే అణ్వాయుధాల ప్రమాదం లేదు. సెనెట్ సెలెక్ట్ కమిటీ ముందు డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటిలిజెన్స్ చెప్పిన మాటలివి. అలాంటప్పుడు ఇస్రాయీల్ ఎలా ఈ ఆరోపణలు చేస్తుంది? ఈ ఆరోపణలు నమ్మేసి అమెరికా అధ్యక్షుడు ఎలా మొదట బెదిరింపు ట్వీటు చేశాడు?

నిజానికి అణ్వాయుధాల వంటివి సాధారణ ప్రజలను కూడా మట్టుపెట్టే మారణాయుధాలు కాబట్టి ఇస్లాంకు విరుద్ధమని ఈరాన్ వాటికి దూరంగా ఉంటున్నట్లు ఒక విధానాన్ని ప్రకటించింది. కాని ఇప్పుడు ఈరాన్ కూడా అణ్వాయుధాలు సంపాదించే పరుగులో వేగం పుంజుకుంటోంది.

ఈరాన్‌లో ఇస్రాయీల్ అనేక హత్యలకు పాల్పడింది. సైన్యాధికారులు, అణుశాస్త్రవేత్తలను హతమార్చింది. ఈరాన్ నేలపై హమాస్ నాయకుడు ఇస్మాయీల్ హానియాను హతమార్చింది. ఇస్రాయీల్‌పై ఈరాన్ ఆగ్రహావేశాల వెనుక ఇంత నేపథ్యం ఉంది. కాని ఈరాన్ అణు ఒప్పందం విషయంలో ముందడుగు వేయడానికి సిద్ధపడిందని చాలా మంది విశ్లేషకుల అభిప్రాయం. అయితే నెతన్యాహు ఈరాన్‌పై దాడికి పాల్పడి ఈ ఒప్పందాన్ని అటకెక్కించాడు. అమెరికా చేసింది మోసంగానే ఇప్పుడు ఈరానీలు చూస్తున్నారు.

ఇప్పుడు ఈరాన్ వద్ద రెండే మార్గాలున్నాయి. ఇస్రాయీల్ దాడిని భరించి, ట్రంప్ బెదిరింపులకు లొంగిపోయి ఒప్పందం చేసుకోవడం. కాని ఇరాక్ విషయంలో ఏం జరిగింది, సిరియా విషయంలో ఏం జరుగుతుందో ఈరానీలు చూస్తున్నారు. ఇక మిగిలిన ప్రత్యామ్నాయం యుద్ధం. ఇస్రాయీల్‌పై మిస్సయిళ్ళ వర్షం కురిపించడం. ఆ సామర్థ్యం ఈరాన్ వద్ద ఉంది. ఇప్పటికే ఇస్రాయీల్ ఈ మిస్సయిళ్ళ దాడికి బెంబేలెత్తుతుంది.

ఇస్రాయీల్ గాజాలో చేస్తున్న యుద్ధంతో సాధించింది ఏదీ లేదు. హమాస్ వంటి సాయుధ సంస్థను మట్టికరిపించలేని ఇస్రాయీల్, బందీలుగా ఉన్న తన పౌరులను విడిపించుకోలేని ఇస్రాయీల్ ఒక బలమైన దేశం ఈరాన్‌ను ఓడిస్తుందని అనుకోవడం భ్రమే. గాజాలో ఇస్రాయీల్ అమానుష దాడులను ప్రపంచం చూస్తూనే ఉంది. నెతన్యాహు యుద్ధపిపాస కూడా ప్రపంచం చూస్తూనే ఉంది. అధికారంలో కొనసాగాలంటే నెతన్యాహుకు యుద్ధం అవసరం. కాని ఇప్పుడు ఈరాన్‌పై చేసిన దాడి చర్య వల్ల అంతర్జాతీయంగా కూడా ఇస్రాయీల్ ఎలాంటి యుద్ధపిశాచమో అందరికీ అర్థమయ్యింది.

ఒకవైపు అణుఒప్పదం కోసం చర్చలంటూ మరోవైపు దాడులు చేసి దెబ్బతీయడాన్ని పెద్ద మోసంగా ఈరాన్ భావిస్తోంది. ఉత్తరకోరియా వైఖరిని చాలా మంది ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. దశాబ్దాలుగా ఆంక్షలు, బెదిరింపులను ఉత్తర కొరియా వద్ద అణ్వాయుధాలు ఉండడం వల్లనే ఆ దేశంపై ముందస్తు దాడులు, ప్రివెంటివ్ దాడులు చేయడానికి ఎవరూ సాహసించడం లేదు. ఇప్పుడు ఈరాన్ నేతలు ఉత్తర కొరియా ఉదాహరణను తీసుకుంటారా?

పాశ్చాత్య దేశాలు యుద్ధవిరమణ జరగాలంటున్నాయి కాని ఇస్రాయీల్‌ను తప్పుపట్టడం లేదు. రష్యా చైనాలు ఇస్రాయీల్ ను విమర్శించడమే కాదు, ఈరాన్‌కు మద్దతుగా నిలిచాయి.

నిజంగా అణ్వస్త్ర వ్యాప్తిని అడ్డుకోవడమే లక్ష్యమైతే అణుఒప్పందం ద్వారా ఈరాన్‌ను నిలువరించే అవకాశం ఉండేది. కాని ఇప్పుడు ఈరాన్ అణుఒప్పందాన్ని లక్ష్యపెట్టడం లేదు. ఒప్పందానికి ఆసక్తి చూపించడమూ లేదు.

ఈ యుద్ధం మరింత కాలం కొనసాగితే అమెరికాకు ఇబ్బందికరంగా మారవచ్చు. అమెరికా యుద్ధవిమానాలు ఈరాన్‌లో కూలిపోయాయన్న వార్తలు వచ్చాయి. ఐరన్ డోమ్ ఈరాన్ మిస్సయిళ్ళను ఆపలేకపోతుంది. అమెరికా ఇచ్చిన థాడ్ రక్షణ వ్యవస్థ కూడా అడ్డుకోలేకపోయింది. ఈ వార్తలు అమెరికాలోని ఆయుధ వ్యాపారానికి గొడ్డలిపెట్టు. మరోవైపు రష్యా ఇచ్చిన రక్షణ వ్యవస్థ పనిచేయడం వల్లనే అమెరికా విమానాలు కూల్చగలిగారనే వార్తలు వస్తున్నాయి. అంతర్జాతీయంగా ఈ పరిస్థితి అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టమే.

ఈ నేపథ్యంలో యుద్ధవిరమణకు అమెరికా ఇతర దేశాల సహాయంతో ఒత్తిడి తీసుకురావచ్చు. ఈరాన్ ఎలా ప్రతిస్పందిస్తుందో చూడాలి. ఇస్రాయీల్ యుద్ధవిరమణకు ఒప్పుకుంటుందా? ఏది ఏమైనా ఈ యుద్ధం మధ్యప్రాచ్యంలో రాజకీయ సమీకరణాలను పూర్తిగా మార్చేస్తుందన్నది నిజం. ✤




# మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు

**యండి. ఉస్మాన్ ఖాన్, సీనియర్ జర్నలిస్ట్**

**మధ్యప్రాచ్యం మళ్లీ అగ్నిగుండంగా మారింది. గాజాపై ఇస్రాయీల్ కొనసాగిస్తున్న దాడులు, ఇటీవల ఈరాన్‌పై జరిపిన గగనతల దాడులు, వాటికి ప్రతిస్పందనగా ఈరాన్ ప్రయోగించిన మిస్సైళ్ల వర్షం, ఇస్రాయీల్‌కు అమెరికా అండ, ఇరాన్‌కు ఎమన్ మద్దతు – ఇవన్నీ ఈ ప్రాంతంలో పూర్తిస్థాయి యుద్ధ వాతావరణాన్ని సూచిస్తున్నాయి.**

ఈ యుద్ధాగ్ని జ్వాలలు రాజుకోడానికి వెనుక ఉన్న అసలైన కారణాలను, నిగూఢంగా నడుస్తున్న రాజకీయ ప్రయోజనాలను, ముఖ్యంగా అమెరికా వాణిజ్య కాంక్షను పరిశీలించినట్లయితే, అమెరికా, ఇస్రాయీల్‌ల రక్తదాహం మనకు అర్ధమవుతుంది. మిగిలిన ప్రపంచమంతా స్పందించినా, అమెరికా అండగా నిలవడంతో ఇస్రాయీల్ ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. భారత్ తన వైఖరిని స్పష్టం చేయకుండా తటస్థంగా ఉండడం కూడా ప్రశ్నార్థకంగా మిగిలింది.

## శవాలపై ఆధిపత్య పోరాటం

ఇస్రాయీల్ గాజా మీద అక్టోబర్ 2023 నుంచి దాడులు ప్రారంభించింది. హమాస్ – ఇస్రాయీల్ మధ్య మొదలైన ఈ దాడుల పరంపర అనతికాలంలోనే ఏకపక్ష సామూహిక హింసాకాండగా మారింది. వేల మంది పౌరులు చనిపోయారు. స్కూళ్లు, హాస్పిటళ్లు, జలమూలాలు, విద్యుత్ స్టేషన్లు ధ్వంసమయ్యాయి. శరణార్థి శిబిరాలు కూడా బాంబుల లక్ష్యాలయ్యాయి. 2025 జూన్ నాటికి మృతుల సంఖ్య 36,000 దాటిపోయింది. ఇందులో మూడొంతులు చిన్నపిల్లలే. ఇది యుద్ధం కాదు. ఇది మానవత్వం మీద జరిగిన అమానవీయ హింసాకాండ. ఒక జాతి జాతినే అంతం చెయ్యాలన్న లక్ష్యంతో జరుగుతున్న రాక్షస కృత్యం.

## ఇస్రాయీల్-ఈరాన్ ఘర్షణ: మరింత సంక్షోభం లోకి మధ్య ప్రాచ్యం

ఇస్రాయీల్ 2024 ఏప్రిల్ 1న సిరియాలోని డెమాస్కస్‌లో

గాజాలో నెలకొన్న ఆహార సంక్షోభాన్ని ఎంతోకొంత నివారించేందుకు ప్రపంచ దేశాలు అందిస్తున్న మానవతా సహాయాన్ని కూడా ఇజ్రాయిల్ అమానవీయంగా అడ్డు కుంటోంది. ఆహారం, పాలు, నీరు, అత్యవసర మందులు కూడా అందక ప్రతినిత్యం వందల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా మానవతా సహాయ ప్రయత్నాలు ఊపందుకున్నాయి. తాగునీరు, ఆహారం, మెడిసిన్ సరఫరా ప్రయత్నాలను ఇజ్రాయిల్ కేవలం నిర్లక్ష్య ధోరణితో కాకుండా, ఉద్దేశ పూర్వకంగానే అవి అవసరార్థులకు చేరకుండా అడ్డు కుంటోంది.

జూన్ 12, 2025న ఐరోపా మానవహిత సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో 200 టన్నుల సహాయంతో 'హోప్ ఫ్లోట్స్ ' అనే నౌక గాజా తీరానికి బయలు దేరింది. ఈ ప్రయా ణంలో వాతావరణ ఉద్యమకారిణి, సామాజిక కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్‌తో పాటు పలు మానవతా సంస్థల ప్రతి నిధులు ఉన్నారు. కాని, ఈ సహాయక నౌకను ఇజ్రాయిల్ సముద్రంలోనే నిలిపివేసింది. భద్రతా పరిశీలన అని పైకి చెబుతున్నా, వాస్తవంగా ఇది సహాయాన్ని అడ్డుకునే చర్యగా ప్రపంచవ్యాప్తంగా విమర్శలకు గురైంది.

అంతేకాక, జూన్ 10న, ఐక్యరాజ్య సమితి ద్వారా సరఫరా చేయబడిన సహాయ ట్రక్కులు నాలుగు రోజుల పాటు ఇజ్రాయిల్ చెక్‌పాయింట్ల వద్ద నిలిపివేయబడ్డాయి. కొన్ని సందర్భాల్లో నెలల తరబడి సహాయక వాహనాలు నిలిపి వేయడంతో అందులోని అత్యవసర మందులు కూడా కాలంచెల్లే స్థితికి చేరుకుంటున్నాయి. ఈ విధంగా, సహాయం చేరవేయడంలో జాప్యం మాత్రమే కాకుండా, వేలాది రూపాయల విలువైన ఆహార పదార్థాలు, మందులు వృథా అవుతున్నాయి.

ఈ నేపథ్యంలో, ఐక్యరాజ్య సమితి సహాయ సంస్థ (UNRWA) తన ప్రత్యేక నివేదికలో,: 'ఇజ్రాయిల్ ప్రవర్తన గాజాలో మానవతను మంట కలుపుతోంది. ఇది అంత ర్జాతీయ మానవ హక్కుల ఉల్లంఘనకు స్పష్టమైన ఉదా హరణ' అని పేర్కొంది.

తాజాగా, అమెరికా మద్దతుతో ఏర్పాటైన తాత్కాలిక సహాయ మార్గాలను కూడా తాత్కాలికంగా నిలిపివేయడం వల్ల, లక్షలాది మంది ప్రజలు చెట్ల నీడలో బతుకుతూ, ఆహార పదార్థాల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఒకవైపు ఇజ్రాయిల్‌కు అన్ని రకాల మద్దతునిస్తూ, మరోవైపు ఇజ్రాయిల్ దాడుల్లో పోయిన ప్రాణాలు పోగా మిగిలిన క్షతగాత్రులకు నాలుగు రొట్టెముక్కలు సహాయం చేసి తానేదో గొప్ప మానవతావాదినన్నట్లు డబ్బా కొట్టుకోవడం అమెరికా ద్వంద్వ నీతికి నిదర్శనం.

ఇంతటి తీవ్ర మానవ సంక్షోభంలోనూ, ఇజ్రాయిల్ తన మనస్తత్వాన్ని చాటుకుంటూ దుష్ట రాజకీయం కొనసాగి స్తున్నదంటే, ఇది కేవలం యుద్ధం మాత్రమే కాదు, మానవ తపై నిర్వహిస్తున్న అమానవీయ దాడి కూడా.!

ఉన్న ఈరాన్ దౌత్య కార్యాలయంపై గగనతల దాడి చేసింది. దీనికి ప్రతిగా 2024 ఏప్రిల్ 13న ఈరాన్ 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ ' పేరిట మిస్సైళ్ళు, డ్రోన్ల వర్షంతో ఘాటుగా ప్రతిదాడి చేసింది. అప్పటికే వాతావరణం ఉద్రిక్తంగా ఉన్న సమయంలో, 2025 జూన్ 13న మూడవ దశలోకి ప్రవేశించిన తాజా దాడులు ఈ సంక్షోభాన్ని మరింత అమానవీయ స్థాయికి తీసు కెళ్లాయి.

2025 జూన్ 13న 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరిట ఇజ్రాయిల్ దాదాపు 100కు పైగా లక్ష్యాలపై దాడులు జరిపింది. ఇందులో ఈరాన్ అణు స్థావరాలు, IRGC కేంద్రాలు, రహస్య రక్షణ ప్లాంట్లు టార్గెట్ అయ్యాయి. వెంటనే ఈరాన్ 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్ III. పేరుతో ప్రతిదాడి చేసింది. 150 బాలిస్టిక్ మిస్సైళ్లతో పాటు 100కి పైగా డ్రోన్లు ప్రయోగించింది. బాట్ యామ్ నగరంలోని నివాస భవనం పూర్తిగా ధ్వంసమైంది. కనీసం 15 మంది మరణించారు. వందల సంఖ్యలో గాయ పడ్డారు.

మూడవ రోజు నాటికి కూడా పరస్పర దాడులు కొనసాగు తుండగా, పర్షియన్ గల్ఫ్‌లో చమురు ధరలు భారీగా పెరిగాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తమ నౌకలను పర్షియన్ గల్ఫ్‌లో మోహరించాయి. జర్మనీ, చైనా, బ్రెజిల్ ఈ దాడులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.

## శాంతి తీర్మానంపై వీటో చేసిన ఏకైక దేశం అమెరికా

ఇటీవల జరిగిన (2025 జూన్ 4) ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశంలో గాజాలో తక్షణం మిలిటరీ దాడులను

ఆపాలనే తీర్మానానికి 14 దేశాలు మద్దతు ఇచ్చాయి. అయితే ఒక్క అమెరికా మాత్రమే ఇస్రాయీల్‌కు మద్దతుగా వీటో చేసింది. భద్రతా మండలిలోని 15 సభ్య దేశాల్లో 14 దేశాలు ఇస్రాయీల్ తక్షణమే దాడులు ఆపాలని డిమాండ్ చేసినా, అమెరికా తన వీటో అధికారంతో అడ్డుకుంది.

జనరల్ అసెంబ్లీలోని 193 దేశాల్లో 149 దేశాలు 'ఇస్రాయీల్ తక్షణమే దాడులు ఆపాలి' అని ఓటేశాయి. ఊరంతా ఒక దారైతే ఉలిపి కట్టెది మరోదారి అన్నట్లు, ప్రపంచమంతా గాజా వైపు నిలబడి న్యాయం కోసం గళం విప్పుతుంటే, అమెరికా మాత్రం తన మానస పుత్రుడైన ఇస్రాయీల్‌కు రక్షణ కవచంగా నిలిచింది.

## భారత్ తటస్థత వెనుక రాజకీయ కారణాలు

గాజాలో కాల్పుల విరమణకు మద్దతుగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానానికి భారతదేశం గైర్హాజరై, పరోక్షంగా ఇస్రాయీల్ దుశ్చర్యలకు మద్దతు పలికింది. ఒక రోజు తర్వాత, ఈరాన్‌పై ఇస్రాయీల్ సైనిక దాడులను తీవ్రంగా ఖండిస్తూ షాంఘై సహకార సంస్థ SCO చేసిన ప్రకటనకు కూడా భారత ప్రభుత్వం దూరంగా ఉంది. ఈ ప్రకటనపై SCO వద్ద భారతదేశం చర్చలలో పాల్గొనలేదు. అంటే SCO సభ్య దేశాలు సంయుక్తంగా ఇస్రాయీల్ దాడులను ఖండిస్తూ విడుదల చేసిన ప్రకటనపై భారత్ సంతకం చెయ్యలేదు. అయితే విదేశాంగ శాఖ మాత్రం 'ఇరు పక్షాలు శాంతికి చొరవ చూపాలి' అనే ఒక సాధారణ ప్రకటనతో తన బాధ్యత నెరవేరిందని పించుకుంది.

## తటస్థ వైఖరి వెనుక కారణాలు

1. ఇస్రాయీల్‌తో ఉన్న రక్షణ ఒప్పందాలు, ఆయుధ దిగుమతులు.
2. ఈరాన్‌తో చమురు సంబంధాలు, నిర్మాణ బంధాలు.

నిజానికి, ఇస్రాయీల్ వ్యవహారం కేవలం హమాస్‌పై పోరాటం కాదు. అది ప్రజల మీద దాడి. ఒక వర్గాన్ని, ఒక జాతిని తుద ముట్టించాలన్న దుష్ట ప్రయత్నం.

పిల్లలు బాంబుదాడుల్లో చనిపోవడం,

తల్లులు శవాల పక్కన ఏడుస్తూ కనిపించడం,

బహుళ అంతస్తుల భవనాలు నేలమట్టమవడం, ఇవన్నీ మానవతా విలువలకు మరణ శాసనాలు.

## ఇప్పుడు ప్రపంచం ముందున్న ప్రశ్నలు ఏమిటంటే...

1. మానవ హక్కుల్ని అత్యంత దారుణంగా ఉల్లంఘిస్తున్న ఇస్రాయీల్‌కు అమెరికా ఎందుకు అండగా నిలుస్తోంది?
2. అమెరికా ఆయుధాలతో ఇస్రాయీల్ బాంబులు వేస్తుంటే, UNO ఎలా నిస్సహాయంగా చూస్తూ ఊరుకుంటోంది?
3. భారత్ ఎందుకు గట్టిగా స్పందించడం లేదు?
4. ముస్లిం దేశాలు ఎందుకని మౌన వ్రతం పాటిస్తున్నాయి?
5. పలస్తీనాకు పూర్తిస్థాయి దేశం హోదా రావాలంటే అంతర్జాతీయ సమాజం ఏ విధమైన కార్యాచరణ చేపట్టాలి?

గాజా, ఇస్రాయీల్, ఈరాన్, మధ్యప్రాచ్య సంఘర్షణలు అంతర్జాతీయ రాజకీయాలకు పావులే కావచ్చు. కానీ అక్కడ చనిపోతున్నది మాత్రం మనుషులే. రేపటి తరం చిన్నారులే.

ఇదంతా చూస్తూ మౌనం పాటించడమంటే, మనిషి మనిషి తనాన్ని, మానవత్వాన్ని కోల్పోవడం మాత్రమే కాదు, త్యజించడం కూడా!

ఇకనైనా ప్రపంచం జాగృతమవ్వాలి.

భారత్ తన వైఖరిని స్పష్టంగా చెప్పాలి.

ఇస్రాయీల్ మానవ హక్కులను గౌరవించాలి.

పలస్తీనా ప్రజలకు శాంతియుత జీవితం హక్కుగా ప్రకటించాలి.

**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు సర్క్యులేషన్ మేనేజర్‌కు ఫోన్ చేయండి : 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు Screen Shot పంపి 9989903850 ఫోన్ చేయండి.

**Bank Details**

Geeturai Weekly
Account No:1042789768
Bank: Central Bank of India
Noorkhan Bazar Branch,
IFSC Code. CBIN0282407
Hyderabad- 500 002, Telangana

Office Address: Geeturai Weekly
Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar
Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com


# 'చరితార్థులు'-2



# నియామతుల్లా అన్సారి

## (1903 -1970)

**85**




**వ్యక్తి** సత్యాగ్రహోద్యమంలో మహాత్మునిచే గోరక్‌పూర్ జిల్లా ప్రథమ సత్యాగ్రహిగా ఎంపికయిన ఖ్యాతిని దక్కించుకున్న నియామతుల్లా అన్సారి సెప్టెంబర్ 28, 1903లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, గోరఖ్‌పూర్‌లో జన్మించారు. తండ్రి మియాఁ రహ్మతుల్లా అన్సారి ప్రముఖ వ్యాపారి. విద్యాభ్యాసం నిమిత్తం కలకత్తా వెళ్ళిన అన్సారి స్వాతంత్ర్యోద్యమం దిశగా నడక ఆరంభించడంతో, ఆయన తండ్రి గోరక్‌పూర్ రప్పించి స్థానిక కళాశాలలో చేర్పించారు. ఆయనలోని బలమైన స్వాతంత్ర్యేచ్ఛ నిలువనివ్వకపోవడంతో చదువుకు స్వస్తి చెప్పారు. మహాత్ముడ్ని, నెహ్రూను ఆదర్శంగా తీసుకున్న అన్సారి స్థానికంగా భారత జాతీయ కాంగ్రెస్ నిర్మాణం మీద దృష్టి నిల్పారు. 1924లో గోరఖ్‌పూర్ కేంద్రంగా భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటు చేసారు. క్రమక్రమంగా జిల్లా నుండి జాతీయ స్థాయి వరకు పదవులను చేపట్టి సమర్థవంతంగా నిర్వహించారు. మహాత్ముని ఆదేశాల మేరకు 1930లో ఉప్పు సత్యాగ్రహం నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. 1931 నాటి వ్యక్తి సత్యాగ్రహ ఉద్యమంలో గోరఖ్‌పూర్ జిల్లా స్థాయిలో 'ప్రథమ సత్యాగ్రహి'గా పాల్గొన్న అన్సారి ఒకటిన్నర సంవత్సరం జైలు శిక్షకు గురయ్యారు. 1939లో జాతీయ స్థాయి 'మోమిన్ అన్సారి కాన్ఫెరెన్స్'ను భారీ స్థాయిలో గోరఖ్‌పూర్‌లో నిర్వహించి ఆంగ్ల పాలకుల నుండి విముక్తి కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని తీర్మానం చేయించారు. ఆంగ్ల పాలకుల పెత్తనం, దోపిడీ తదితర అంశాలను వివరిస్తూ జమీందార్, నిగార్ లాంటి ఉర్దూ ప్రతికలలో కవితలు, సమాచారయుక్తమైన సాధికారిక వ్యాసాలను అన్సారి రాశారు. స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాకుండా సామాజిక అంతరాలకు, వివక్షకు వ్యతిరేకంగా కూడా అన్సారి పోరాడారు.



**9440241727**

**బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త సయ్యిద్ నశీర్ అహమ్మద్ రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' - 2 (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం**

ముస్లింలను 'ఉన్నత-నిమ్న' వర్గాలుగా విభజిస్తూ నిమ్నవర్గాల నుండి 'రజాలత్ టాక్స్' పేరుతో స్థానిక జమీందారు సాగిస్తున్న బలవంతపు వసూళ్ళకు వ్యతిరేకంగా నియామతుల్లా ఆన్సారి న్యాయ పోరాటం సాగించి 'నిమ్నోన్నత' వివక్షతను రూపు మాపారు. 1940లో ముస్లింలీగ్ విభజన తీర్మానాన్ని తీవ్రంగా ఖండించిన అన్సారి విభజన వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమం దిశగా ప్రజలను తన ప్రసంగాలు, రచనల ద్వారా ఉత్తేజితుల్ని చేయడం మాత్రమే కాకుండా కార్యక్రమాల నిర్వహణలో కూడా కార్య దక్షతతో తన సత్తా చూపారు. ఆ కారణంగా అన్సారిని ఆంగ్ల ప్రభుత్వం 'ప్రమాదకర వ్యక్తి'గా పరిగణించింది. భౌతిక - ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నా ఆయన వెనుకడుగు వేయలేదు. 1942 నాటి 'క్విట్ ఇండియా' ఉద్యమంలో అన్సారి చురుగ్గా తాను పాల్గొనడమే కాకుండా ప్రజా సమూహాలను కూడా సమర్థవంతంగా కదిలించిన కారణంగా రెండున్నర సంవత్సరాలు జైలు పాలయ్యారు. స్వాతంత్ర్యం లభించాక ప్రజల సంక్షేమం, పార్టీ ప్రయోజనాలను కాపాడేందుకు నిస్వార్థంగా కృషి సాగించిన అన్సారి 1962 నాటి అసెంబ్లీ ఎన్నికలలో గోరఖ్‌పూర్ శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. ప్రజాప్రతినిధిగా చేనేత వృత్తిదారుల, వివక్షకు గురవుతున్న ఇతర వర్గాలను సంఘటితం చేస్తూ ఆయా వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి సాగించిన నియామతుల్లా అన్సారి 1970 జూలై ఎనిమిదిన కన్నుమూశారు. ✤

5/3

# మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ رضي الله عنه

ఎస్.ఎమ్. మలిక్

## 3. ఆయన ఘనత

### భార్యా పిల్లలు

మహనీయ తల్హా(ర) విభిన్న సమయాల్లో చేసుకున్న వివాహాల వల్ల ఆయనకు కలిగిన సంతానం ధర్మ సంస్థాపనా మార్గంలో ఆయనకు చేదోడువాదోడుగా వ్యవహరించిన వారే. మగ సంతానంలో ధర్మ పరిరక్షణా కార్యంలో సహకరిస్తూ అమరగతి పొందిన వారున్నారు.

### ప్రత్యేకతలు

మహనీయ తల్హా(ర) మంచి స్థితిపరులు. ఆయన ఆదాయం రోజుకు సగటున వెయ్యి దిర్హములు. ఈ ఆదాయంలో ఒక్కొక్క నాణెం ధర్మ సమ్మతమయిన మార్గం ద్వారా వచ్చేది. అందులో ఆయన కుటుంబం ఖర్చులకు పోగా మిగతా సంపద యావత్తు దైవ మార్గంలో ఖర్చు అయ్యేది. అలా అదంతా పరలోకం కొరకు భద్రమయ్యేది. దైవ నిర్దేశానుసారం అగత్యపరుల్లో ఖర్చు పెట్టడంలో బంధుగణం ప్రథమంగా ఉండేవారు. ఒక సన్నిహిత మిత్రుని ప్రకారం, కేవలం ఒక సంవత్సరం బంధువుల్లో ఖర్చు పెట్టిన రొక్కం నాలుగు లక్షలట. ఇతరత్రా దానధర్మాలు వేరుగా ఉన్నాయి.

ఆయన దానధర్మాల ప్రత్యేకత ఏమంటే కేవలం ముస్లిములే కాదు ముస్లిమేతర అవసరార్థులు సయితం ప్రయోజనం పొందేవారు. ఒకసారి ఆయన యమన్‌లో ఒక ప్రాంతంలో వెళ్ళడం తటస్థించింది. అక్కడ క్రైస్తవ సన్యాసులు నివసించేవారు. కాని అక్కడ నీటి వసతి లేదు. సన్యాసుల ఇక్కట్లు చూసి ఆయన ఎంతో కలత చెందారు. కొంత దూరం వెళ్లిన తరువాత ఒక నీటి బావి అగుపించింది. అది ఓ యమన్ నాయకుని అధీనంలో ఉండేది. ఆ యమన్ నాయకునితో మాటలాడి పెద్ద రొక్కం చెల్లించి ఆ బావి కొనేశారు. దాన్ని ఆ క్రైస్తవ సన్యాసుల కొరకు అంకితం చేశారు, వారిని ఆ చోట వచ్చి నివసించవలసిందిగా కోరుకుంటారు.

ఒకసారి ఓ అరబ్బు తెగవారు ప్రవక్త(శ్రీ(స) సన్నిధిలోకి వచ్చి కొన్ని ప్రశ్నలు అడుగుతారు. ఆ పైన సమాధానాలు

పొంది ఇస్లామ్ స్వీకరిస్తారు. ప్రవక్త మహనీయులు వారి సుశిక్షణ దృష్ట్యా మదీనాలో ఆపాలని కోరుకుంటారు. ఆ రోజుల్లో మహనీయ తల్హా ఆర్థిక స్థితి ఏమంత బాగా లేదు. అయినా ప్రవక్తశ్రీ(స), ఆ నవ ముస్లిముల ఆతిథ్యం ఎవరు స్వీకరిస్తారు? అని అడిగినప్పుడు మహనీయ తల్హా ముందుకు వస్తారు. చాలా రోజుల వరకు వారిని తన ఇంట ఆతిథ్యం ఇస్తారు.

## శౌర్య ప్రతాపాలు

మహనీయ తల్హా (ర) పరాక్రమశాలి. కురైషీలకు ఆ విషయం బాగా తెలుసు. ఇతర తెగలవారు కూడా ఆయన పట్ల జడిసేవారు. తరచూ ప్రవక్తశ్రీ(స) సలపిన పోరాటాల్లో ఆయన ప్రాణాలకు తెగించి చూపిన పరాక్రమం కథనాలుగా చెప్పుకునేవారు జనం. ఉహుద్ రోజునయితే ఆయన చూపిన ధైర్య సాహసాలు ఉదాహరణగా చెప్పుకుంటారు. వివరాలు లోగడ వచ్చేశాయి.

## ప్రేమానురాగాలు

ఆయనకు తన మిత్ర బృందంతో గల ప్రేమానుబంధం కూడా చెప్పుకోదగ్గది. ఒక సంఘటన మాత్రం ఉటంకిస్తున్నాము. మహనీయ కఅబ్ బిన్ మాలిక్(ర) కేవలం అలసత్వం వల్ల తబూక్ పోరులో పాల్గొనలేకపోయారు. అందువల్ల ప్రవక్త మహనీయులు, ముస్లిమ్ సముదాయం, ఆయన విషయంలో దైవిక నిర్ణయం వచ్చే వరకు సాంఘిక బహిష్కరణ పాటించారు. ఆ తరువాత మహనీయ కఅబ్(ర) చెందిన తౌబా (పశ్చాత్తాపం) దైవ సన్నిధిలో స్వీకృతి పొందిన సందర్భంలో ప్రవక్తశ్రీ(స)ని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని ఆయన వద్దకు వస్తారు. ప్రవక్త మహనీయులు(స) మస్జిద్‌లో ఉంటారు. ఆ సందర్భాన్ని మహనీయ కఅబ్(ర) మాటల్లో గమనించండి,

> “నేను ప్రవక్త మస్జిద్‌లో అడుగు పెట్టగానే మహనీయ తల్హా బిన్ ఉబైదుల్లాహ్ దృష్టి నా పైన పడింది. వెంటనే ఆయన నా వైపునకు పరిగిడి వచ్చారు. స్వాగతం పలికారు, కరచాలనం చేశారు, తప్పు క్షమింపబడటం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. దైవ సాక్ష్యం! ఆయన తప్ప ముహాజిరుల్లో ఎవ్వరూ నా వద్దకు లేచి రాలేదు. తల్హా నా పట్ల చూపిన ఈ వైఖరిని నేను ఎన్నడూ మరువలేను.”

దీనివల్ల ఇతర ముహాజిర్ ముస్లిములకు మహనీయ కఅబ్ పశ్చాత్తాపం స్వీకృతి వల్ల సంతోషం కలగ లేదని అర్థం కాదు. నిజానికి సంతోషం వల్ల వారి ముఖాలూ వికసించాయి, అయితే ఆ సంతోషం వల్ల లేచిన ఆనంద తరంగానికి మహనీయ తల్హాలో ఉప్పొంగిన ఉద్వేగం పట్టరానిదయి ఆయన ఆ విధంగా స్పందించారు. ఈ ప్రత్యేక స్పందనను మహనీయ కఅబ్ కూడా జీవితమంతా గుర్తుంచు కున్నారు.

## జాగరూకత

మహనీయ తల్హా(ర) ప్రవక్త మహనీయుల సన్నిధిలో సంవత్సరాల తరబడి గడిపినా ఇతర సహచర మాన్యుల వలే హదీసులు ఉటంకించడం పట్ల ఎంతో జాగ్రత్త వహించారు. ఆయన హదీసులు ఎన్నుకోవడం పట్ల ఒక ప్రామాణికత పాటించారు. సదా ప్రముఖమయిన విషయాలు, ధార్మిక ప్రాథమిక అంశాల పైనే ఇతోధికంగా శ్రద్ధ చూపారు. ఉదాహరణకు ఆరాధనల విషయంలో ఆయన దిగువ హదీసు ఉల్లేఖించారు:

నేనుండగా దైవ సందేశహరుల వద్దకు నజ్ద్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వచ్చాడు. అతని జుత్తు చిందు వందుగా ఉండేది. మేము అతని గుసగుస లాంటిది వినగలిగాము. కాని అతను చెప్పేదేమిటో అర్థం కాలేదు. అతను దగ్గరికి వచ్చినప్పుడు ఇస్లామ్ గురించి అడుగు తున్నాడని బోధపడింది. ప్రవక్తశ్రీ(స) చెప్పారు, “రేయి పగలు కలిపి ఐదు పూటల నమాజ్” అని. అతను, “ఇంకా ఏమయినా?”అని అడిగాడు. “రమజాన్ నెల ఉపవాస వ్రతాలు” అని సమాధానం ఇచ్చారు ప్రవక్తశ్రీ(స). అతను తిరిగి అడిగాడు, “ఇంకా ఏమయినా?” అని. ఆ తరువాత దైవ సందేశహరులు(స) జకాత్ గురించి చెప్పారు. “ఇంకా ఏమయినా ఉందా?” అని అడిగాడు ఆ వ్యక్తి. ఆ పైన ఆ వ్యక్తి ఇలా చెప్పుకుంటూ వెను తిరిగాడు, “దేవుని సాక్షి, ఇంతకన్నా అధికంగానూ చెయ్యను, తక్కువ గానూ చెయ్యను.” ఇది విని దైవ సందేశహరులు నుడివారు, “ఇతను నిజం చెప్పినట్లయితే సాఫల్యం పొందాడు” అని.

ఇస్లామ్ ఆరాధనలకు సంబంధించిన ఈ హదీసులో హజ్జ్ ప్రస్తావన లేదు. కారణం, హజ్జ్ విధి అయినది హిజ్రీ 8వ సంవత్సరం. ఈ సంఘటన హజ్జ్ విధి అయిన సంవత్సరానికి పూర్వం జరిగింది.

**(సమాప్తం)**



# ఇస్లామ్ విశ్వాస వ్యవస్థ

**- డాక్టర్ సాజిద్ అబ్బాసి**

**ఖుర్ఆన్**లోని విశ్వాసాలను నిరూపించడానికి మనిషి అంతరంగంలోను, బాహ్య విశ్వంలోను అనేక ఆధారాలున్నాయి. బుద్ధీజ్ఞానాల ద్వారా, ఉదాహరణల ద్వారా ఈ విశ్వాసాల సత్యబద్ధత నిరూపితమవుతోంది. తార్కిక వాదనలతోపాటు విశ్వాసాలకు సంబంధించి హృదయాల్లో తలెత్తే ప్రశ్నలకు సమాధానాల ద్వారా మనసుల్లో నాటుకుపోయేలా చేయడం జరిగింది. చారిత్రక ఆధారాలు కూడా చూపించడం జరిగింది. ఈ విశ్వాసాలను ఎప్పుడెప్పుడు తిరస్కరించడం జరిగిందో అప్పుడప్పుడు బాధ్యతారాహిత్యం జనించింది. నైతికత నాశన మైంది. అలాంటి జాతి వినాశనానికి గురైంది.

ఇస్లాంలో మూడు మౌలిక విశ్వాసాలు ఉన్నాయి. అవి : దేవుని ఏకత్వం (తౌహీద్), ప్రవక్తల పరంపర (రిసాలత్), పరలోకం (ఆఖిరత్). విశ్వాసాలకు సంబంధించిన శీర్షికలివి. ఈ త్రివిధ విశ్వాసాల తర్వాతనే ఒక వ్యక్తి ఇస్లాం పరిధిలోకి వస్తాడు. ఖురాన్ ప్రధానంగా బోధించేది ఈ విశ్వాసాలే. ఖురాన్లో ఎక్కువ భాగం ఈ విశ్వాసాల గురించే ఉంది. ఖురాన్ సంవాదగ్రంథం అని చెప్పవచ్చు. అందుకే అల్లాహ్ పంపిన వాక్యాల పారాయణాన్ని విన్నప్పుడు విశ్వాసుల విశ్వాసం ఇనుమడిస్తుంది (సూరహ్ అల్-అన్ఫాల్: 2). ఖురాన్‌ను అర్థం చేసుకుంటూ చదువుతున్న కొద్దీ, అందులోని బలమైన వాదనల వల్ల విశ్వాసం హృదయాలలో పటిష్టమవుతుంది. అందుకే విశ్వాసాన్ని పటిష్టపరచుకోడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గం ఖురాన్ పారాయణం. మార్గదర్శకత్వం కోసం ముస్లిమేతరులు ఖురాన్ అనువాదం చదివినప్పుడు, వారి హృదయాలలో విశ్వాసం చిగురిస్తుంది.

ఇస్లాంలో విశ్వాసాలపై గుడ్డినమ్మకం లేదు. ఖురాన్ కోరేది ఏమిటంటే, బలమైన తార్కిక వాదనల వెలుగులో విశ్వాసం జనించాలి. అది మనిషిలో జ్ఞానంతో కూడుకున్న విశ్వాసాన్ని సృష్టిస్తుంది. ఆ తర్వాత ఆ విశ్వాసం అభివృద్ధి చెందుతూ వాస్తవిక విశ్వాసం స్థాయికి చేరుకుంటుంది. విశ్వాసాన్ని చివరి స్థాయికి తీసుకువెళితే అది సత్యవిశ్వాసం. జ్ఞాన విశ్వాసం అంటే జ్ఞానపరమైన ఊహలు, అంచనాలతో దేవుని గురించిన గ్రహింపు. వాస్తవిక విశ్వాసం అంటే దేవుని చిహ్నాలను ప్రత్యక్షంగా చూసి దేవుణ్ణి చూస్తున్నట్లు నమ్మడం. సత్య విశ్వాసం అంటే అల్లాహ్ అనుగ్రహాలను గుర్తుచేసుకుని, దేవుని సర్వసత్తాకాధికారాన్ని గురించి అనుభూతి చెందడం. ఖురాన్ తన పాఠకుడిని విశ్వాసం యొక్క స్థాయిల వరకు తీసుకు వెళ్తుంది. ఇస్లాం విశ్వాస వ్యవస్థ విభిన్నమైనది. అగోచర విషయాలను గుడ్డిగా నమ్మాలని చెప్పడం ఉండదు. రుజువులు, ఆధారాలు లేకుండా నమ్మాలని చెప్పడమూ ఉండదు. ప్రశ్నలు అడగడాన్ని విశ్వాసరాహిత్యంగా భావించడమూ ఉండదు. ఖురాన్ ఆలోచనాయోచనలను ప్రోత్సహిస్తుంది.

(సూరహ్ అల్-నిసా: 82, సూరహ్ ముహమ్మద్: 24).

**అల్లాహ్ తన అపరిమిత దయతో జీవితపు చివరి శ్వాస వరకు మనిషికి తన పాపాలను ఒప్పుకొని పశ్చాత్తాపపడే గడువు ఇస్తాడు. కాని మరణాన్ని తన కళ్ళ ముందు చూస్తున్న అంత్యఘడియల్లో బహుదేవతారాధన వంటి పాపాలకి క్షమాపణ లభించదు. విశ్వాసాలలో దేవుని ఏకత్వం లేదా తౌహీద్ అత్యంత ముఖ్యమైనది.**

## విశ్వాసాలంటే ఏమిటి? వాటి ఉద్దేశ్యం ఏమిటి?

విశ్వాసం అంటే మన ఇంద్రియ జ్ఞానానికి అతీతమైన వాస్తవాలను గుర్తించి ఒప్పుకోవడం. అల్లాహ్ మనిషిని శ్రేష్టమైన సృష్టిగా పుట్టించాడు. మనిషికి బుద్ధి మేధోశక్తి ఇచ్చాడు. మనిషిని పరీక్షించడానికి దేవుడు సృష్టించాడు. మొదటి, అతి పెద్ద పరీక్ష ఏమిటంటే, మనిషి తన మేధస్సును ఉపయోగించి తన ఇంద్రియాతీత వాస్తవాలను అంగీకరించాలి. అందుకే మొదటి పరీక్ష బుద్ధిజ్ఞానాల పరీక్ష. మనిషి తన మేధస్సును ఉపయోగించి అగోచర వాస్తవాలను సచేతనంగా అంగీకరించాలి. ఆ తర్వాత రెండో పరీక్ష ఏమిటంటే, విశ్వాస స్థాయిలో ఒప్పుకున్న వాస్తవాలకు అనుగుణంగా జీవించాలి. నడుచుకోవాలి. అగోచర జ్ఞానంలో అతి పెద్ద వాస్తవం, మహా సత్యం ఏమిటంటే, ఈ విశ్వానికి ఒక సృష్టికర్త ఉన్నాడు. విశ్వాసాలలో ఇది అత్యంత ముఖ్యమైనది. ఒక మనిషి దేవుడిని ఈ విశ్వానికి ఏకైక సృష్టికర్తగా, తన ప్రభువుగా అంగీకరించినప్పుడు, ఆ విశ్వప్రభువు సర్వసత్తాక అధికారాల్లో మరొకరిని చేర్చరాదు. ఆ ఒక్కడినే ఆరాధనీయుడిగా అంగీకరించాలి. దైవత్వంలో ఎవరికీ భాగస్వామ్యం కల్పించరాదు. ఆ ఒకే ఒక్క సృష్టికర్తకే దాస్యం చేయాలి. ఆయనకు విధేయత చూపాలి. దేవుని పట్ల అవిధేయుడై ఇతరులకు విధేయత చూపకూడదు. ఇది విధేయతకు సంబంధించిన పరీక్ష. విధేయతతో శిరస్సు వంచడమే ఇస్లాం. అన్ని అనుగ్రహాలను ప్రసాదించింది అల్లాహ్‌యే. కాబట్టి, ఆయన్నే అత్యధికంగా ప్రేమించాలి. అన్ని అధికారాలు అల్లాహ్ చేతిలో ఉన్నాయి కాబట్టి, ఆయన్నే నమ్ముకోవాలి. ఆయన్నే సహాయం కోసం అర్థించాలి. సృష్టికర్తను తిరస్కరించడం అంటే విశ్వంలో అతిపెద్ద సత్యాన్ని తిరస్కరించడమే. అల్లాహ్‌ను కాదని ఇతరులను ఆరాధించడం, ఇతరులను అభ్యర్థించడం, అల్లాహ్‌తోపాటు ఇతరులను ఆరాధనల్లో, అభ్యర్థనల్లో భాగస్వామిగా చేయడం, అతి పెద్ద కృతఘ్నత. ఇది క్షమించరాని పాపంగా పరిగణించబడింది. అల్లాహ్ తన అపరిమిత దయతో జీవితపు చివరి శ్వాస వరకు మనిషికి తన పాపాలను ఒప్పుకొని పశ్చాత్తాపపడే గడువు ఇస్తాడు. కాని మరణాన్ని తన కళ్ళ ముందు చూస్తున్న అంత్యఘడియల్లో బహుదేవతారాధన వంటి పాపాలకి క్షమాపణ లభించదు. విశ్వాసాలలో దేవుని ఏకత్వం లేదా తౌహీద్ అత్యంత ముఖ్యమైనది. అల్లాహ్ ఖురాన్‌లోని సూరహ్ అల్-ఇఖ్లాస్‌లో స్వచ్ఛమైన ఏకదైవారాధనను ఇలా తెలియజేశాడు: "ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షా పరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడ ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు." (ఇఖ్లాస్)

ఈ సూరాలో అల్లాహ్ గుణాలు తెలియజేయబడ్డాయి. ఈ గుణగణాల ప్రాతిపదికన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలని చెప్పడం జరిగింది. అల్లాహ్ తన అధికారం విషయంలో, ఈ గుణగణాల విషయంలో అద్వితీయుడు. ఆయన ఒకే ఒక్కడు. ఆయనకు సాటి మరెవ్వరూ లేరు. నిరపేక్షాపరుడు, ఎవరిపైనా ఆధారపడే అవసరం లేనివాడు ఆయన. అందరూ ఆయనపై ఆధారపడతారు. ఆయనకు ఏదీ అవసరం లేదు. ఆయనకు అలసట రాదు. నిద్ర ఉండదు. అన్నపానీయాల అవసరం లేదు. భార్యాపిల్లల అవసరం లేదు. ఆయన అన్ని అవసరాలకు అతీతమైనవాడు. ఆయనకు సంతానం ఎవ్వరూ లేరు. ఆయన ఎవరికీ తండ్రి కాదు. ఆయనకు సమానమైనది ఏదీ లేదు. ఆయన గుణగణాలన్నింటిలోను అత్యున్నతమైనవాడు. అందరికీ జీవనోపాధిని ఇస్తాడు. ఎవరి నుండి తీసుకోడు. ఒకే సమయంలో అందరి మాటలు వింటాడు. ఒకే సమయంలో అందరినీ చూస్తాడు. అందరి పరిస్థితుల గురించి తెలిసినవాడు. మనుషుల మనస్సులోని మాటలు, సంకల్పాల గురించి కూడా తెలిసినవాడు. విశ్వంలో ఉన్న ప్రతిదీ ఆయన సృష్టి. ఆయన తప్ప అంతా సృష్టించబడినవే. ఖురాన్ అల్లాహ్ ఉనికి గురించి, ఆయన ఒకేఒక్కడని చెప్పడానికి ఇచ్చిన ఆధారాలు:

### 1. మనిషి సహజ స్వభావం ప్రాతిపదికన ఆధారాలు:

ఈ విశ్వం దైవం లేకుండా లేదని మనిషి సహజ స్వభావం సాక్ష్యమిస్తుంది. అల్లాహ్ ఇలా అన్నాడు:

> **"వారు పడవలోకి ఎక్కినపుడు తమ ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని ఆయన్ని వేడుకుంటారు. తరువాత ఆయన వారిని రక్షించి నేలపైకి తీసుకురాగానే, అకస్మాత్తుగా వారు బహుదైవారాధన చేయటం ప్రారంభిస్తారు" (అన్ కబూత్: 65)**

అల్లాహ్ మనిషి స్వభావాన్ని ఈ విధంగా సృష్టించాడు. మనిషి కష్టాల్లో చిక్కుకున్నప్పుడు తన సృష్టికర్తను ఎలుగెత్తి పిలుస్తాడు. నాస్తికులు కూడా తీవ్రమైన కష్టాల్లో చిక్కుకున్నప్పుడు, అన్నింటిపై అధికారమున్న ఆ ఒక్క అస్తిత్వాన్ని హృదయపూర్వకంగా పిలుస్తారు, ఆ అస్తిత్వంతో వారి స్వభావం వేళ్ళూనుకుని ఉంటుంది. సాధారణ పరిస్థితులలో, మనిషి తన ఊహలు, అంచనాల ఆధారంగా కొందరిని దేవుళ్ళుగా లేదా దేవుని సిఫార్సుదారునిగా చేసుకుని, కష్టాల్లో ఉన్నప్పుడు తన గోడును వారికి చెప్పుకుంటారు. కాని వారి వల్ల నిరాశ చెందితే, అప్పుడు అన్నింటిపై అధికారమున్న ఒకే ఒక్క అస్తిత్వం ఉందని, అది మాత్రమే రక్షిస్తుందనే స్పృహ జనిస్తుంది. ఆ అస్తిత్వమే వాస్తవానికి అల్లాహ్. కష్టాల్లో మాత్రమే మనిషికి అల్లాహ్ అస్తిత్వం గుర్తుకు వస్తుంది. ఆ ఒకేఒక్క దేవుడే శక్తిమంతుడని, తాను నిస్సహాయుడని అంగీకరిస్తాడు.

## 2. మనిషి అంతరంగంలోను, బాహ్యావిశ్వంలోను ఉన్న సాక్ష్యాధారాలు:

ఈ అద్భుతమైన విశ్వంలో విస్తరించి ఉన్న లెక్కలేనన్ని చిహ్నాలు ప్రతి క్షణం ఈ విశ్వానికి ఒక సృష్టికర్త ఉన్నాడని నిరూపిస్తున్నాయి. ఆయన అత్యంత శక్తివంతుడు. అంతులేని జ్ఞానం కలవాడు. ఈ విశ్వంలో ఇప్పటి వరకు 13 లక్షల రకాల జీవులు కనుగొనబడ్డాయి ప్రతి సంవత్సరం 13 వేల కొత్త రకాలు కనుగొనబడుతున్నాయి. శాస్త్రవేత్తల అంచనా ప్రకారం, భూమిపై, సముద్రంలో 10 కోట్లకు పైగా జీవజాతులు, వృక్షజాతులు ఉండవచ్చు. అన్నింటిలో ఒకే రకమైన కణ నిర్మాణం (cell structure) కనిపించడం సృష్టికర్త సృజనాత్మక నైపుణ్యం. ప్రతి కణం కేంద్రంలో DNA ఉంటుంది. ఇందులో ఒక జెనెటిక్ కోడ్ ఉంటుంది, అది ఆ జాతి జీవి శరీర నిర్మాణం బ్లూప్రింట్ కలిగి ఉంటుంది. ఒకే సృష్టికర్త ఉన్నాడన డానికి ఇది స్పష్టమైన రుజువు. ఈ విషయాన్ని ఖురాన్ ఈ విధంగా తెలియజేసింది: **"భూమిపై సంచరించే ఏ జంతువునైనా, గాలిలో రెక్కలతో ఎగిరే ఏ పక్షినైనా చూడండి. ఇవన్నీ మీవంటి జీవరాసులే. వాటి విధివ్రాత ఉన్న గ్రంథంలో మేము ఏ కొరతా చెయ్యలేదు." (అన్ ఆమ్: 38)**

ఇక్కడ 'గ్రంథం' అంటే DNA, ఇది సంపూర్ణమైన మరియు అత్యంత ఖచ్చితమైన సమాచారాన్ని కలిగి ఉంటుంది, ఇందులో ఏ చిన్న లోపం ఉన్నా ఏ జీవి శరీరమైనా ఏర్పడటం అసాధ్యం. ప్రశ్న ఏమిటంటే, ఏ సాఫ్ట్‌వేర్ కోడ్ కూడా ప్రోగ్రామర్ లేకుండా దానికదే ఉనికిలోకి రాగలదా? అలాంటి సంక్లిష్ట సమాచారం బుద్ధిజ్ఞానాల ప్రమేయం లేకుండా సాధ్యమేనా? ఒక జీవి కణంలో ఒక ప్రపంచం ఇమిడి ఉంది, ఇందులో అనేక కార్యకలాపాలు జరుగుతాయి. ప్రపంచంలో అత్యంత ఖచ్చితమైన సమాచారం జంతువుల కణాల్లోను, చెట్టుచేమల కణాల్లోను ఉంది. లక్షలాది రకాల జీవులు పరిణామ ప్రక్రియ ఫలితంగా పుట్టినట్లయితే, ఇంత సంక్లిష్టమైన మొదటి కణాన్ని ఎవరు కనుగొన్నారు? జీవ పరిణామ సిద్ధాంతాన్ని నమ్మే వారి వద్ద ఈ ప్రశ్నకు సమాధానం లేదు. జీవ కణంలో DNA రూపంలో ఉన్న సమాచార నిధి గురించి ఎవరికీ తెలియని కాలంలో సృష్టి సిద్ధాంతానికి పోటీగా జీవపరిణామ సిద్ధాంతం వచ్చింది. కాని డిఎన్ఏలో నిగూఢమైన సమాచారం ఉండడం అత్యంత తెలివైన సృష్టికర్త ఉనికిని సూచిస్తుంది. ఒక సాధారణ గడియారం గురించి ఎవరైనా అది దానికదే తయారైందని చెబితే, మనం అతడిని పిచ్చివాడిగా పరిగణిస్తాం. జీవకణం గడియారం కంటే కోట్లాది రెట్లు సంక్లిష్టమైనది. ఇప్పటి వరకు శాస్త్రవేత్తలు రసాయన పదార్థాల నుండి ఒక కణాన్ని తయారు చేయలేకపోయినప్పుడు, ఈ గొప్ప విశ్వ సృష్టికర్త లేకుండా అది ఉనికిలోకి వచ్చిందని ఎలా చెప్పగలం? అల్లాహ్ ఇలా అన్నాడు: **"ఆయన ప్రతి వస్తువునూ వివేకంతో తీర్చిదిద్దాడు"** (నమ్ల్: 88). అంటే, అన్ని జీవజాతుల్లో సృష్టి అద్భుతం కనిపిస్తుంది.

మనిషి విశ్వంలో లభించే పదార్థాలను, ఉదాహరణకు ఇనుమును ఉపయోగించి, ఉపయోగకరమైన వస్తువులను తయారు చేశాడు. అవి మనిషికి అవసరానికి ఉపయోగపడ తాయి. కాని మనిషి మూలకాలను (Elements), రసాయానిక సమ్మేళనాలను (Compounds) శూన్యం నుండి తయారు చేయడం లేదు. అలాంటి శక్తి కూడా మనిషికి లేదు. ద్రవ్యాన్ని దేవుడు శూన్యం నుంచి ఎలా సృష్టించాడని నాస్తికులు ప్రశ్నిస్తారు. దీనికి సమాధానం మనకు శాస్త్రీయ వాస్తవంలో లభిస్తుంది. శక్తి నుండి ద్రవ్యం ఉత్పత్తి చేయబడుతుంది. ద్రవ్యం నుంచి శక్తి ఉత్పత్తి చేయబడుతుంది. అల్లాహ్ వద్ద అనంతమైన శక్తి ఉన్నప్పుడు, ఆ శక్తి నుండి భౌతిక ద్రవ్యాలను ఉత్పత్తి చేయడం సృష్టికర్తకు కష్టమా? ఈ శాస్త్రీయ యుగంలో దేవుని సృజనాత్మక శక్తిని అర్థం చేసుకోవడం గతం కన్నా చాలా సులభం.

## 3. వివేకవివేచనల సాక్ష్యాధారాలు:

ప్రపంచంలో ప్రతి వస్తువు ఏదో ఒక ప్రయోజనం కలిగి ఉంటుంది. ఉదాహరణకు, భూమి అక్షం (Earths Axis) కాస్త వంగి ఉంటుంది. దీనిని ఆక్సియల్ టిల్ట్ (Axial Tilt) అంటారు - సుమారు 23.5 డిగ్రీలు. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతున్నప్పుడు, అక్షం వంపు వివిధ సమయాలలో సూర్యరశ్మి కోణాన్ని మారుస్తుంది. దీని వలన భూమిలోని వివిధ ప్రాంతాలలో

వివిధ సమయాలలో ఋతువులు మారుతూ ఉంటాయి. ఈ అమరిక అత్యంత వివేకవంతుడైన సృష్టికర్త ఉన్నాడని సూచి స్తుంది. అదేవిధంగా, భూమి సూర్యుని నుండి ఒక నిర్ణీత దూరంలో ఉండటం వలన భూమిపై జీవులకు బతకడం సాధ్యమైంది. పర్వతాల కారణంగా భూమి కదలికలో సమతుల్యత ఏర్పడింది. భూమి తన అక్షంపై తిరిగే (Rotation) వేగం సుమారు ప్రతి గంటకు 1670 కిలోమీటర్లు. ఈ భ్రమణం వల్ల రాత్రింబవళ్ళు ఏర్పడతాయి. భూమి సూర్యుని చుట్టూ తన కక్ష్యలో తిరిగే (Revolution) వేగం సుమారు ప్రతి గంటకు 1,07,000 కిలోమీటర్లు. ఒక చుట్టు ఒక సంవత్సరంలో పూర్తవుతుంది. ఇంత వేగంగా భూమి కదులుతున్నప్పటికీ, పర్వతాల కారణంగా ఈ కదలిక మనకు తెలియదు. సముద్రపు నీరు ఉప్పగా చేయబడింది. దీనివల్ల సముద్రంలో పారిశుద్ధ్యం సాధ్యమయ్యింది. ప్రతిరోజు కోట్లాది జలచరాలు చనిపోయే సముద్రపు నీరు ఎంత మురికిగా మారుతుందంటే, జలజీవనం అసాధ్యమయ్యేది. కాని సముద్రజలాల ఉప్పదనం వల్ల ఆ సమస్య పరిష్కారమయ్యింది. సముద్రపు జంతువులు మానవ ఆహార అవసరాన్ని చాలావరకు తీరుస్తాయి. చంద్రుడిని భూమి నుండి ఒక నిర్ణీత దూరంలో ఉంచడం వలన చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి (Gravity) కారణంగా సముద్రంలో అలలు ఏర్పడతాయి. దీనితో సముద్రపు నీరు శుభ్రపడుతూ ఉంటుంది. చంద్రుడు తన గురుత్వాకర్షణ శక్తి కారణంగా సముద్రపు నీటిని తన వైపుకు లాగుతాడు, దీని వలన ఆటుపోట్లు (High and Low Tides) ఏర్పడతాయి. భూమికి చంద్రుడికి మధ్య దూరం సుమారు 3,84,400 కిలోమీటర్లు. ఈ ప్రత్యేక దూరం చాలా అనుకూలమైనది. దీనివల్ల అలల శక్తి చాలా ఎక్కువ కాదు లేదా చాలా తక్కువ కాకుండా తగినవిధంగా ఉంటుంది. చంద్రుడు భూమికి చాలా దగ్గరగా ఉన్నట్లయితే, అలలు చాలా తీవ్రంగా ఉండేవి, అందువల్ల తీరప్రాంతాలు మునిగిపోయి, భూమిపై జీవితం ప్రమాదంలో పడేది. చంద్రుడు చాలా దూరంలో ఉన్నట్లయితే, అలలు చాలా బలహీనంగా ఉండేవి, సముద్రంలో నీరు నిశ్చలంగా ఉండేది. సూర్యకిరణాలు సముద్రంపై పడినప్పుడు ఆవిరిగా మారేలా చేశాడు దేవుడు. దీని ద్వారా సముద్రం నుండి శుభ్రమైన నీరు ఆవిరి రూపంలో గాలిలో పైకి లేచి మేఘాలుగా మారుతుంది. అప్పుడు గాలులు ఈ మేఘాలను అల్లాహ్ సంకల్పం ప్రకారం వర్షం కురవాల్సిన ప్రదేశాలకు తీసుకువెళ్తాయి. ఈ నీరు పర్వతాలపై ఘనీభవిస్తుంది. దీని వలన సంవత్సరం పొడవునా నదులు ప్రవహిస్తూ ఉంటాయి. వర్షం రూపంలో నీరు కురిసినప్పుడు, భూమి దానిని పీల్చుకొని భూగర్భంలో నీటి ఊటలు ప్రవహిస్తాయి, బోర్వెల్ రూపంలో నీటిని పొందవచ్చు. వర్షం వలన చెరువులు నిండిపోతాయి. వీటి నుండి జీవజాలం దాహం తీరుతుంది. పొలాలకు నీరు లభిస్తుంది. పైప్‌లైన్ లేకుండా అల్లాహ్ ట్రిలియన్ల గ్యాలన్ల నీటిని ఉప్పు లేకుండా సముద్రం నుండి ఎలా ఎత్తి, మొత్తం భూమిని ఎలా తడుపుతున్నాడు. దీనిని వాటర్ సైకిల్ అంటారు. ఇది సృష్టికర్త వివేకవివేచన శక్తికి రుజువు కాదా? ఈ విషయాన్ని అల్లాహ్ ఇలా చెప్పాడు: **"ఆకాశం నుండి మేము సరిగ్గా లెక్క ప్రకారం ఒక ప్రత్యేక పరిమాణంలో నీటిని దింపాము, దానిని భూమిలోపల నిలువ చేశాము. మేము దానిని ఎలా కోరితే అలా మాయం చేయగలం." (మూమినూన్: 18)**

మేము ఆకాశం నుండి సరిగ్గా లెక్క ప్రకారం ఒక నిర్దిష్ట పరిమాణంలో నీటిని దింపాము మరియు దానిని భూమిలో స్థిరపరిచాము, మేము దానిని మేము కోరుకున్నట్లుగా అదృశ్యం చేయగలం.

చంద్రుడు, సూర్యుడు, భూమి తగిన పరిమాణంలో సృష్టించాడు దేవుడు. వాటి మధ్య దూరాలను తగిన విధంగా సృష్టించాడు. సంపూర్ణ సూర్యగ్రహణం, సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భాలలో, అవి వివిధ పరిమాణాలలో ఉన్నప్పటికీ, అన్నిటి పరిమాణం ఒకేలా అనిపిస్తుంది. ఇది కేవలం యాదృచ్ఛికమా? అల్లాహ్ భూమిని దాని కక్ష్యలో సూర్యుని చుట్టూ తిప్పడమే కాదు, భూమి అక్షంపై తిరిగేలా సృష్టించాడు. తన అక్షంపై అది 24 గంటలలో ఒకసారి తిరుగుతుంది, దీని ద్వారా రాత్రింబవళ్ళ వ్యవస్థ ఏర్పడింది. అక్షంపై భ్రమణం లేకపోతే, రాత్రిపగలు ఉండేవి కావు. ప్రాణులు పగటి వెలుగులో పనిచేసిన తర్వాత రాత్రి విశ్రాంతి అవసరం. తమ నిద్రను పూర్తి చేసుకోవచ్చు. ఈ స్వాభావిక అవసరాన్ని తీర్చడానికి రాత్రింబవళ్ళ వ్యవస్థ కోసం అల్లాహ్ భూభ్రమణం ఏర్పాటు చేశాడు. ఈ భ్రమణమే లేకపోతే జీవితం అసాధ్యమయ్యేది. రాత్రింబవళ్ళ వ్యవస్థ కాలాన్ని, తేదీలను లెక్కించడానికి ఉపయోగపడుతుంది. భూభ్రమణం కాలమానానికి తోడ్పడమే కాదు మానవ నాగరికతకు దోహద పడింది. అందుకే అల్లాహ్ ఇలా చెప్పాడు: **"భూమీ, ఆకాశాల సృష్టిలో రేయింబవళ్ళు ఒకదాని తరువాత ఒకటి రావడంలో, నిలుచున్నా, కూర్చున్నా, పరుండినా అన్నివేళలా అల్లాహ్‌ను స్మరించే వారున్నూ, భూమీ, ఆకాశాల నిర్మాణం గురించి చింతన చేసేవారున్నూ అయిన వివేకవంతులకు ఎన్నో సూచనలు ఉన్నాయి." (ఆలె ఇమ్రాన్: 190)**

వెలుగుబాట

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**35 ఆయత్‌లు** **మక్కా అవతరణ**

# 46. అల్ అహ్కాఫ్

8 వారనేదేమిటీ, దీన్ని ప్రవక్త స్వయంగానే కల్పించుకున్నాడనేనా? వీరికి చెప్పు, "నేను స్వయంగా దీన్ని కల్పించినట్లయితే మీరు నన్ను దేవుని పట్టు నుండి ఎంతమాత్రం తప్పించజాలరు, మీరు చేస్తున్న ప్రేలాపనలేవో అల్లాహ్ బాగా ఎరుగు; నాకూ మీకూ మధ్యన సాక్ష్యం పలకడానికి ఆయన మటుకే చాలు, మరాయన ఎంతో క్షమించేవాడు, మరెంతో కరుణించేవాడు."[11]

9 వీరికి చెప్పు, "నేనేదో సరికొత్త సందేశహరుణ్ణయితే కాను, రేపు మీ పట్ల ఏమి జరగనున్నదో, నా ఎడల ఏమి సంభవించనున్నదో నేనేమీ ఎరుగను. నేను కేవలం నా వద్దకు పంపబడే వహీని మాత్రమే అనుసరిస్తూ ఉంటాను. మరి నేనొక అతి స్పష్టంగా హెచ్చరించేవాణ్ణి తప్ప మరేమీ కాను."[12]

11. ఇక్కడ ఈ వాక్యం రెండు అర్థాలు సూచిస్తుంది. ఒకటి, వాస్తవానికి ఇది అల్లాహ్ దయ, క్షమాగుణం మూలంగానే ఈ జనులు భువిలో శ్వాస పీల్చుకోగలుగుతున్నారు. దైవ వచనాన్ని కల్పన అనడానికి వీరికి ఎటువంటి జంకు కలగటం లేదు. ఒక దయలేని, కఠినుడయిన దైవం ఈ జగతికి స్వామి అయినట్లయితే ఇటువంటి దుస్సాహసవంతులకు ఒక్క ఊపిరి తరువాత మరో ఊపిరి పీల్చుకునే భాగ్యం ప్రాప్తమయ్యేది కాదు. రెండవ భావం, దుర్మార్గులారా, ఇప్పటికయినా ఈ మొండిపట్టును వదలండి, దైవకారుణ్యం మీ కోసం తెరచుకునే ఉంది, మీరు ఇప్పటి వరకు చేసినదంతా క్షమించబడటమూ సాధ్యమే.

12. ఇలా సెలవిచ్చిన దానికి పూర్వరంగం ఏమిటంటే, ప్రవక్త మహనీయులు (స) తన్ను తాను దేవుని సందేశహరునిగా పరిచయం చేసుకున్నప్పుడు మక్కా పుర ప్రజలు దీని మీద రకరకాలుగా మాటలు కల్పించసాగారు. ఈయనేమి దైవ సందేశహరుడండీ, పిల్లాజెల్లా ఉన్నారు, బజారుల్లోనూ తిరుగుతూ ఉంటాడు, తింటూ త్రాగుతూ ఉంటాడు, మాలాంటి మానవుల్లా జీవితం గడుపుతూ ఉంటాడు. ఇంతకూ ఇతను సామాన్య ప్రజలకు భిన్నమయిన వ్యక్తి అవడానికి ఇతనిలో కొత్త విషయం ఏముందనీ, ఇతన్ని దైవం తన సందేశహరునిగా చేసుకున్నాడని మేమెలా భావించగలం. వారు ఇంకా ఇలా అనేవారు, దేవుడు ఈయన్ని తన సందేశహరుడుగానే చేసుకున్నట్లయితే ఇతనికి బంట్రోతుగా ఒక దైవదూతను పంపవలసింది, ఈ వ్యక్తి దేవుని సందేశహరుడని ప్రకటించడానికి. ఈయన పట్ల అమర్యాదగా ప్రవర్తించే ప్రతి వ్యక్తికి ఒక కొరడా దెబ్బ వేయడానికి. దేవుడు ఎవరినయినా తన సందేశహరుడుగా నియమించడం, అతన్ని ఇట్టే మక్కా వీధుల్లో తిరగటానికి, అన్ని విధాల అన్యాయాలు సహించడానికి ఎటువంటి అండదండలు లేకుండా వదలివేయడం ఎలా సంభవం? మరేదీ లేకపోయినా దేవుడు తన సందేశహరునికోసం కనీసం ఒక మహత్తరమయిన మహలు, పండ్లు ఫలాలతో తులతూగే ఒక తోటనయినా పుట్టించవలసింది. అలా జరిగి ఉంటే, దైవ సందేశ హరుని భార్య సంపద తరిగిపోయిన తరువాత ఇతనికి పస్తులుండే గతి పట్టి ఉండేది కాదు; తాయిఫ్ వెళ్ళడానికి అతనికి ఒక వాహనమయినా ప్రాప్తమవకుండా ఉండేది కాదు. ఇంతేకాక ఈ జనాలు ఆయనకు విభిన్నమయిన మహత్యాలు చూపెట్టమని కోరేవారు, అజ్ఞాత విషయాలను గురించి ఆయన్ని విచారించేవారు. వారి అభిప్రాయంలో ఒక వ్యక్తి దేవుని సందేశహరుడవడం అంటే, దానికి భావం అతను మానవాతీత శక్తులు కలిగి ఉండాలి. అతను సైగ చేస్తే కొండలే కదలిపోవాలి, ఎడారులు సయితం ఉద్యానవనాల్లా మారిపోవాలి, అతనికి సమస్త (ఉనికిలో ఉన్నదీ, ఉనికిలోకి రానున్న దాని) గురించి జ్ఞానం ఉండాలి, అగోచర తెరల వెనక దాగి ఉన్నదంతా అతనికి ప్రకాశమానంగా కనబడాలి.

ఈ మాటలకే ఈ వాక్యాల్లో సమాధానం ఇవ్వడం జరిగింది. వీటిలోని ప్రతి వాక్యంలోనూ అర్థాల ఒక ప్రపంచమే దాగి ఉంది:

ఇలా సెలవీయబడింది, "వీరికి చెప్పు, నేనేదో సరికొత్త సందేశ హరుణ్ణయితే కాను." అంటే, నన్ను సందేశహరునిగా నియమించడం ప్రపంచ చరిత్రలో తొలి సంఘటనయితే కాదు, దైవ సందేశహరుడు ఎలా ఉంటాడో, ఎలా ఉండడో అన్న విషయం అర్థం చేసుకోవడంలో మీకు కష్టం కలగటానికి. నాకు ముందు అనేకమంది సందేశహరులు వచ్చి ఉన్నారు, నేను వారికన్నా భిన్నమయినవాణ్ణి కాను.

**12వ పాదసూచిక మిగతా వచ్చే సంచికలో)**

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

అడుగు జాడలు

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2
(కితాబుల్ మగాజీ)

## మహాప్రవక్త(స) వ్యాధి, ఆయన పరమపదించిన సంఘటన

**అధ్యాయం : 83**

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "(ఓ ముహమ్మద్!) నీవూ మరణిస్తావు, వారూ మరణించవలసినవారే. చివరకు ప్రళయ దినాన మీరంతా మీ ప్రభువు సమక్షంలో మీ మీ వ్యాజ్యాలను వినిపిస్తారు." *(అజ్ జుమర్ : 30, 31)*

హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వాతో ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మరణ వ్యాధికి గురై ఉన్నప్పుడు ఇలా అనేవారు: "ఆయిషా! ఖైబర్‌లో నేను నా నోట్లో వేసుకున్న (విషపూరితమైన) అన్నపు ముద్ద ఇప్పటికీ నా మీద ప్రభావం చూపుతూనే ఉంది. ఆ విష ప్రభావంతో నా కంఠనాళం తెగిపోయేలా ఉంది."

**287)** ఉమ్మె ఫజ్ల్ బిన్తె హారిస్(ర.అ) అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి)తో ఇలా అన్నారు: "ప్రవక్త మహనీయులు(స) మగ్రిబ్ నమాజ్‌లో "వల్ ముర్సలాతి ఉర్ఫా" సూరాను పారాయణం చేస్తుండగా నేను విన్నాను. ఆ తరువాత ఆయన(స) తనువు చాలించే వరకూ మళ్ళీ మాకు నమాజ్ చేయించలేదు."

**288)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు: మహనీయ ఉమర్(రజి) (బాల్యంలో) నన్ను తన సమావేశాలలో కూర్చోబెట్టుకునేవారు. దీనిపై అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) అభ్యంతరం తెలుపుతూ, ఇతని లాంటి పిల్లలు మీకూ ఉన్నారు కదా! అన్నారు. దానికి ఉమర్(రజి), "ఈ అబ్బాయికి నేనెందుకు ఇంతగా ప్రాధాన్యత ఇస్తున్నానో మీకూ తెలుసు" అన్నారు. తరువాత ఉమర్(రజి) ఇబ్నె అబ్బాస్(రజి)తో, 'ఇజాజాఅ నస్రుల్లాహి వల్ ఫత్‌హు' (నస్ర్-1) ఆయత్ గురించి ప్రశ్నించగా, 'ఇందులో దైవప్రవక్త(స) మరణ సమాచారం ఉంది' అని చెప్పారు. అప్పుడు ఉమర్(రజి), "ఈ ఆయత్ గురించి నీవు చెబుతున్నదే నేనూ అనుకుంటున్నా'[1] నని అన్నారు.

**289)** విశ్వాసుల మాత హజ్రత్ ఆయిషా(ర.అ) ఉర్వా బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు: ప్రవక్త మహనీయులు(సఅసమ్) ఎప్పుడయినా అస్వస్థతకు గురైనప్పుడు 'ముఅవ్వజాత్' (సూరయె ఇఖ్లాస్, సూరాయె ఫలఖ్, సూరయె నాస్) పఠించి, తన చేతులపై ఊది, వాటిని తన శరీరంపై స్పర్శించేవారు. కాని ఆయన (స) మరణ వ్యాధికి గురైనప్పుడు, నేనే ఆ సూరాలను పఠించి ఊదటం మొదలెట్టాను. ఇంకా ఆయన చేతిని ఆయన శరీరంపై తడిమే దానిని (స్వస్థత చేకూరుతుందన్న ఆశతో అలా చేసే దానిని).

**290)** హజ్రత్ ఆయిషా(ర.అ) అబ్బాద్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు: మరణ ఘడియలలో నేను ప్రవక్త మహనీయుని (సఅసమ్) మాటలను చెవియొగ్గి మరీ విన్నాను. ఆ సమయంలో ఆయన(స) తన వీపును నా శరీరానికి ఆనించి ఉన్నారు. ఇలా అంటున్నారు- "దేవా! నన్ను క్షమించు. నాపై కనికరించు. నన్ను ఉన్నత మిత్రుల సరసన చేర్చు."[1]

288-1. మొదటి విషయం, ఇబ్నె అబ్బాస్(రజి) దైవప్రవక్త(స) పిన తండ్రి కుమారుడు. దానికి తోడు పసితనం నుండే ఆయన పండితుడు. జ్ఞాన సంపన్నుడయిన వ్యక్తిని అందరూ ఆదరించాలి.


ఈ సూరా అవతరించిన మీదట దైవప్రవక్త(స) ఎక్కువ సమయం దైవారాధనలో, పాపాల మన్నింపునకై వేడుకోవటంలో గడిపేవారు.


290-1. ఎంతటి వారైనా, వారికి దైవ సామీప్యం లభించి ఉన్నా తప్పుల మన్నింపునకై దైవాన్ని వేడుకోవటం ధర్మం. ఇదే దైవదాస్య భావానికి చిహ్నం. నిజానికి ఆయన(స) తప్పులన్నిం టినీ మన్నిస్తున్నట్లు అల్లాహ్ ప్రకటించాడు. అయినప్పటికీ మహాప్రవక్త(స) ఒక దాసునిగా ఆదర్శాన్ని నెలకొలిపారు.

# TELUGU ISLAMIC PUBLICATIONS TRUST (Regd.)


# తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)

TRUST





10 సంపుటాలు





5 భాగాలు













**ఇప్పటి వరకు 360 పుస్తకాలు ముద్రించి రెండు తెలుగు రాష్ట్రాలతో సహా దేశ విదేశాలలోని తెలుగు పాఠకులకు ఇస్లామీయ సాహిత్యాన్ని అందజేస్తున్న ఏకైక సంస్థ.**

తెలుగులో దివ్యఖుర్ఆన్, మహాప్రవక్త ముహమ్మద్(స) జీవిత చరిత్ర, ఆయన (స) ప్రవచనాలు ఇంకా సామాజిక, చారిత్రక అంశాలపై ఇస్లామీయ సాహిత్యం కోసం సంప్రదించండి.

మరిన్ని వివరాలకు సంప్రదించండి

## TELUGU ISLAMIC PUBLICATIONS TRUST (Regd.)


Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar, Hyderabad-500002

Bank Details: TELUGU ISLAMIC PUBLICATIONS TRUST

Central Bank of India, Noorkhan Bazar Branch, Hyderabad A/c. No. 1042789779 IFSC Code. CBIN0282407

**9963498695, 9989903850, 9985394757**

మానసిక వికాసం



మంగళగిరి జీలాని

# మంచి స్నేహితులు

**మనం** చిన్నతనం నుండి ఇంటి పని (హెూం వర్క్) వాయిదాలు వేస్తూ ఆఖరి నిమిషం వరకు పని పూర్తి చెయ్యకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల చేత తిట్లు తినడం గుర్తుండే ఉంటుంది. పెద్ద పిల్లలు, కాలేజీ విద్యార్థులకైనా ఇది వర్తిస్తుంది. ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ఎంత సమయం ఇచ్చినా, దాదాపు తరగతిలోని పిల్లలందరి ప్రాజెక్టులు పేలవంగా ఉండటం టీచర్లకు ఎదురయ్యే అనుభవమే. దీనికి కారణం వాయిదాల మనస్తత్వం లేదా చివరి నిమిషం వరకు వారు వాటిని పూర్తి చెయ్యకపోవడం. స్కూలు, కాలేజీలలో ఇలా చేయడం అలవాటయిపోవటం చేత మనం పెద్దయ్యాక కూడా ఇది కొనసాగుతుంది. చదువుకునే సమయంలో అంతగా నష్టం జరగకపోవచ్చు. తరువాత జీవితంలో వాయిదాల వల్ల చాలా నష్టం కలుగుతుంది.

➢ దీనిని పోగొట్టుకోవడానికి ఏం చేయాలి? మొదటగా ప్రతి పనికీ చిన్నదైనా, పెద్దదైనా ఒక నిర్ణీత గడువు ఏర్పరచుకోవాలి. అది దాటేలోపు తప్పకుండా ఆ పనిని పూర్తి చేయాలి. గడువు పెట్టుకున్నాక దాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయవద్దు. అలా చేస్తే ఇతరులతోపాటు మనం మన మీద నమ్మకం, విశ్వాసం కోల్పోతాం. కొంపలంటుకుపోయే పరిస్థితి వస్తే తప్ప ఏ పనీ చెయ్యలేని నిస్సహాయ స్థితికి లోనవుతాం. సమస్య ఇంకా జటిలమైపోతుంది.

➢ పని ప్రారంభించేలోగా దీన్ని ఎలా పూర్తి చెయ్యాలి? ఎవరెవరి సహాయం కావాలి అన్నీ ఆలోచించి పెట్టుకోవాలి. గడువు అనేది పనినిబట్టి నిర్ణయించుకోవాలి. గడువు నిర్ణయించుకోవటమంటే మీ అలవాటును సక్రమంగా, అనుకూలంగా మలచుకుంటు న్నారని, గడువు దగ్గరకొస్తున్న కొద్దీ మీరు పని పూర్తి చెయ్యటానికి తయారవుతూ ఉంటారు అని అర్థం. గడువు సమయం నిర్ణయించుకుని పని పూర్తి చేయటం వల్ల ఉత్పాదకతలోని విలువ, రహస్యం తెలుస్తుంది. ఇది అలవాటుగా మారుతుంది. పనిగంటలను పెంచుకోకుండానే ఉన్న దాంట్లో ఎక్కువ పని చేయగలుగుతారు. కనుక గడువులు మనకు మంచి స్నేహితులు, సహాయకారులు అనడంలో సందేహం లేదు.

మన జీవితం ఎప్పుడు, ఏ క్షణాన ముగిసిపోతుందో తెలియదు కనుక ప్రతి క్షణం విలువైనదే. చివరి ఘడియనే. కనుక మనం అనునిత్యం అప్రమత్తంగా ఉంటూ తుది గడువును దృష్టిలో ఉంచుకుని ముందుకు అడుగులు వేయాలి. ఏమంటారు?

# ఆధార్ అప్‌డేట్ గడువు పొడిగింపు




ఆధార్ డేటాబేస్‌లో ప్రస్తుతం.. కచ్చితమైన సమాచారాన్ని ఉంచేందుకు ఆధార్ హెూల్డర్లకు ఉడాయ్ అవకాశం కల్పిస్తోంది. ఆధార్‌లో చిరునామా వంటి వివరాలు ఉచితంగా మార్చుకునేందుకు ఉడాయ్ మరో ఏడాది పాటు సమయాన్ని పొడిగించింది. సంబంధిత డాక్యుమెంట్లను ఉచితంగా అప్‌లోడ్ చేసుకునేందుకు ఇచ్చిన గడువు జూన్ 14వ తేదీతో ముగిసింది. అలాంటి వేళ ఉడాయ్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేసింది. మై ఆధార్ పోర్టల్ ద్వారా ఉచితంగా ఈ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసుకోవచ్చు. గుర్తింపు పొందిన ఆధారాలు, చిరునామాకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు అనుమతిస్తోంది. అంటే.. వివాహం కావడం.. ఉన్నత చదువులు, తదితర కారణాల వల్ల కొందరు వేర్వేరు ప్రదేశాలకు మారుతుంటారు. అలాంటి వారికి ఇది ఉపయుక్తంగా ఉండనుంది. మరోవైపు ఆధార్ తీసుకుని పదేళ్లు పూర్తయ్యి ఉన్న వారు కూడా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని గతంలో ఉడయ్ సూచించిన సంగతి తెలిసిందే.

# ప్రణాళికాబద్ధమైన జీవితం




- నసీరా బేగం

**మనిషి** ఏ పని చేసినా ఆలోచించి, అర్థం చేసుకున్న తరువాతనే చేస్తాడు. తన లక్ష్యాన్ని పొందటానికి, తన పనిని పూర్తి చెయ్యటానికి ముందు తన మదిలో దానికి సంబంధించిన ఒక చిత్రం తయారు చేసుకుంటాడు. ఆ తరువాత ఆ విధంగా ఆచరిస్తాడు. దానిని పూర్తి చేస్తాడు. ప్రణాళికాబద్ధంగా లేని పని ఎల్లప్పుడూ వైఫల్యాన్నే చవిచూస్తుంది. పని చేసే ముందు మనిషి ఆలోచించి అర్థం చేసుకుని తన కార్యాచరణను మొదలుపెట్టడాన్ని ప్రణాళిక అంటారు. ప్రణాళిక తయారు చేసుకోవటం చాలా ముఖ్యం. ఇది ఆ పనిలో విజయం సాధించటానికి చాలా అవసరం. అది తాళపు చెవి మాదిరిగా పనికి వస్తుంది. ఎవరైతే ప్రణాళికాబద్ధంగా పనిచేస్తారో వారే విజయవంతంగా రాణిస్తారు. ప్రణాళిక మనిషిని అతని భవిష్యత్తు వైపునకు ముందడుగులు వేయిస్తుంది. ప్రణాళికకు మరొక అర్థం ఏమిటంటే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఒక కార్యాచరణను రూపొందించటం.

దివ్యఖుర్ఆన్‌లోని ఎన్నో వాక్యాలు, దైవప్రవక్త(స) గారి ఎన్నో బోధనల ద్వారా తెలిసే విషయమేమిటంటే, ఒక విశ్వాసి గమ్యం పరలోకం. ఈ ప్రపంచం ఒక ప్రయాణం. ఈ ప్రపంచ ప్రయాణంలో అసంఖ్యాకమైన వస్తువులు, కార్యాలు మనిషిని తన వైపునకు ఆకర్షిస్తూ ఉంటాయి. తన లక్ష్యంవైపు నుంచి అశ్రద్ధ వైపునకు లాగుతాయి. మనిషి వివేకం ఏమిటంటే అతను ఈ ఆకర్షవంత మైన వస్తువుల నుంచి ఈ కార్యాల నుంచి తనను తాను కాపాడుకోవాలి. కాని ఇది ఎప్పుడు సాధ్యమవుతుందంటే వీటిని గురించి మనిషి అర్థం చేసుకున్నప్పుడు. వాటి నుంచి తనను తాను కాపాడుకున్నప్పుడు. ఇంకా తన లక్ష్యాన్ని చేరుకోవటానికి ప్రణాళిక తయారు చేసుకున్నప్పుడు. ఇంకా ఆ తరువాత ఆ లక్ష్యం దిశ వైపునకు పయనించినప్పుడు.


దైవప్రవక్త(స) గారి జీవిత చరిత్ర ద్వారా కూడా తెలిసే విషయమే మిటంటే ఆయన(స) తన ప్రతి పనిని ప్రణాళికా పద్ధతితోనే చేసేవారు. ఇంకా ప్రజలు కూడా ఎలా చేయాలో ఆయన(స) ఆచరణాత్మకంగా చేసి చూపించేవారు. దైవప్రవక్త(స) మక్కానగరం నుంచి మదీనా పట్టణానికి వలస పోతున్నప్పుడు ఎంత చాకచక్యంగా ప్రణాళికను తయారుచేశారో చరిత్ర ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. మక్కా నగరంలో ప్రజలు ఆయన సందేశాన్ని స్వీకరించే బదులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉన్నప్పుడు, సందేశ మార్గాలన్నీ మూసుకుపోతూ ఉన్నప్పుడు ఆయన(స) అక్కడ నుంచి వలసపోవటానికి ఆయన(స) గారి సందేశం సులభంగా విస్తరించే అవకాశం ఉన్న ప్రదేశాన్ని ఎన్నుకున్నారు. అక్కడ విశ్వాసులు వలసపోయి గౌరవంగా, శాంతియుతంగా జీవితం గడిపే విధంగా ఇంకా ఈ సందేశాన్ని ఇస్లామీ రాజ్యం స్థాపించే దిశగా ఆయన(స) ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికోసం ఆయన(స) కొన్ని సంవత్సరాల నుంచే అక్కడి ప్రజలకు ధార్మిక శిక్షణను ఇచ్చారు. ఆ తరువాత దైవాజ్ఞ కాగానే అక్కడినుంచి బయలుదేరారు. ఆ ప్రయత్నంలో భాగంగా ఆయన(స) మున్ముందు యస్రిబ్ నుంచి వచ్చిన ఆరుగురికి ఇస్లామ్ ధర్మ సందేశాన్ని ఇచ్చారు. వారు ఆయన(స) గారి సందేశాన్ని స్వీకరించారు. ఒక సంవత్సరం తరువాత వారి సంఖ్య పన్నెండుకు చేరింది. ఆ తరువాత వారి వద్దకు ముస్అబ్ బిన్ ఉమైర్‌కు ధార్మిక శిక్షణ ఇవ్వటానికి అక్కడికి పంపారు. వారి కృషి ద్వారా ఒక సంవత్సరం తరువాత అక్కడ డెబ్భై ఐదుగురు ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. ఆ తరువాత మదీనాలోని ఔ, ఖజ్‌రజ్ తెగలకు చెందిన ప్రజలు విశ్వసించారు. ఆ తరువాత ఆ ప్రజలందరూ ఆయన(స) గారిని తమ వద్దకు రమ్మని ఆహ్వానించారు. అప్పుడు ఆయన(స) వారితో, మీరు తమను

తమ భార్యాపిల్లలను రక్షించే విధంగా మా ప్రాణాలను కూడా రక్షిస్తామనే వాగ్దానాన్ని తీసుకున్నారు. ఆ తరువాత దౌర్జన్యానికి గురవుతున్న మక్కా నగరం విశ్వాసులందరికీ ఒక్కొక్కరిగా అక్కడి నుంచి వలస పొమ్మని ఆదేశించారు. ఆ తరువాత ఆయన(స) తనతోపాటు హజ్రత్ అబూబకర్(ర) గారిని తమ ప్రయాణానికి తోడుగా ఉండటానికి ఎన్నుకున్నారు. ఆ సమయం ఎలాంటిదంటే దైవప్రవక్త(స) గారిని మక్కావాసులు హతమార్చటానికి సిద్ధమై పోయారు. కాని ఆయన(స) గారి వద్ద మక్కా ప్రజల అమానతులు ఉండిపోయాయి. ఆ అమానతులను తిరిగి వాపసు చెయ్యటం గురించి అటువంటి క్లిష్ట సమయంలో కూడా ఆయన(స) ఆలోచించారు. దానికోసం కూడా ఆయన(స) ఒక ప్రణాళికను సిద్ధం చేశారు. ఆయన(స) తన పడక మీద హజ్రత్ అలీ(ర) గారిని పడుకోబెట్టి హజ్రత్ అబూబకర్(ర) గారితోపాటు గోప్యంగా అక్కడి నుంచి బయలుదేరారు. ఈ ప్రణాళిక ద్వారా ఆయన(స) గారు ప్రాణ శత్రువుల నుంచి రక్షణ పొందారు. అందరి అమానతులను తిరిగి వాపసు చేయగలిగారు. ఇంకా ఆ తరువాత తమ ప్రయాణం కోసం రహస్య మార్గాలను కూడా తెలిసినవారిని నియమించుకున్నారు. సురక్షితంగా మదీనా పట్టణానికి చేరుకున్నారు. ఇది ఆయన(స) గారి జీవితానికి సంబంధించిన ఒక ఘట్టం మాత్రమే. ఆయన(స) గారి పూర్తి జీవిత చరిత్రను అధ్యయనం చేసినట్లయితే ఆయన(స) గారి వ్యక్తిగత జీవితం నుంచి సందేశ ప్రదాతగా జీవితం మొత్తం ఎంతో చక్కని ప్రణాళికాబద్ధమైనదని మనకు స్పష్టంగా తెలుస్తుంది. ఆయన(స) ఏ చిన్న పనిచేసినా లేదా యుద్ధాలు చేసినా అన్నీ ఒక ప్రణాళిక ప్రకారం ఉండేవి. ఆయన(స) గారి ఒక్క క్షణం కూడా వృధాగా పోయేది కాదు. కనుక ఆయన(స) గారి జీవిత చరిత్రలో కష్టాలు, కడగండ్లు ఎన్ని ఎదురైనా చివరకు ఫలితం విజయమే అయ్యింది.

దీని ద్వారా తెలిసేదేమిటంటే మనిషి జీవితం తప్పకుండా ఒక ప్రణాళికాబద్ధంగానే సాగాలి. ఎందుకంటే ఇస్లామ్ ధర్మం ప్రకారం మనిషికి జీవితం ఒకే ఒక్కసారి లభిస్తుంది. ఈ జీవితం ద్వారానే మనిషి పరలోకంలోని స్వర్గాన్ని పొందగలుగుతాడు. ఇంకా అందులో కలకాలం ఉండగలుగుతాడు. కాని ఈ ప్రపంచంలో మనిషికి తన వ్యక్తిగత జీవితం గడపవలసి ఉంటుంది. ఒక్కొక్కరి జీవితం ఒక్కో విధంగా ఉంటుంది. ఒక్కొక్కరి లక్ష్యం ఒక్కో విధంగా ఉంటుంది. ఒక్కొక్కరి కార్యకలాపాలు ఒక్కోవిధంగా ఉంటాయి.

కాని సాధారణంగా జరిగే విషయమేమిటంటే చాలా మంది ప్రణాళికలు లేకుండా తమ దినాన్ని గురించి ఏమీ ఆలోచించకుండా తమ బాధ్యతను పూర్తి చేసుకుంటూ ఇట్టే గడిపివేస్తూ ఉంటారు. ఒక ప్రణాళిక అంటూ ఏమీ ఉండదు. దీని కారణంగా వారి అత్యధిక సమయం వృధా అయిపోతూ ఉంటుంది. దీని ద్వారా తమ పూర్తి సమయాన్ని వారు సద్వినియోగపరుచుకోలేకపోతారు. దీని నష్టం ఇహలోకంలో అంతగా జరగకపోయినా దాని పర్యవసానం పరలోకంలో తప్పకుండా చవిచూడవలసి ఉంటుంది. ఒక మహారాజు అయినా ఒక చిన్న సాధారణ మనిషి అయినా తప్పకుండా ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని గడపవలసి ఉంటుంది. అంతెందుకు మన చుట్టూ ఉన్న వాతావరణం, మన కోసం అల్లాహ్ సృష్టించిన సృష్టితాలు, జంతువులు, పశువులు, ఎగిరే పక్షులు ఇవన్నీ ఒక ప్రణాళికాబద్ధంగా ఒక నియమావళి కలిగి ఉంటాయి. ఒకవేళ ఇవి మనిషిలాగా తన ఇష్టానుసారంగా జీవించినట్లయితే మొత్తం సృష్టియే తలక్రిందులు అయిపోయేది. మనిషి జీవితానికి కూడా ఇదే ఉపమానం సరిపోతుంది. ఒకవేళ మనిషి ఇష్టానుసారంగా జీవించినట్లయితే తప్పకుండా అతని జీవితం తలక్రిందులైపోతుంది కూడా. ముఖ్యంగా నేటి మన యువత జీవితం ప్రణాళికాబద్ధంగా లేకపోవటాన్ని మనం చూస్తూనే ఉన్నాము. తమ ఇష్టానుసారంగా తినటం, త్రాగటం, తిరగటం, తమ ఇష్టానుసారంగా కళాశాలలకు వెళ్ళటం, రాత్రిళ్ళు అనవసరంగా జాగారం చెయ్యటం,పిచ్చాపాటి పనులలో, పిచ్చాపాటి మాటలతో తమ సమయాన్ని వృధా చెయ్యటం లేదా తమ చేతిలో ఉన్న ఫోన్‌తో అత్యధిక సమయం గడపటం, వారి జీవితంలో గంభీరత బహు తక్కువగా కనబడుతుంది. జీవితం ఒక్కసారే లభిస్తుంది. తనకు నచ్చినట్లుగా ఆనందంగా జీవిద్దాం అనే ఆలోచన వారిలో అత్యధికమైపోతుంది. ఈనాడు చాలామంది యువతీ యువకులు లక్ష్యరహితమైన జీవితాన్ని గడుపుతున్నారు అనేది స్పష్టంగా తెలుస్తోంది. ఇది మన సమాజం కోసం ఎంతో నష్టదాయకమైనది. ఇది ఇలాగే కొనసాగినట్లయితే మన సమాజం బలహీనతకు గురైపోతుంది. మరియు ఒక పెద్ద లక్ష్యాన్ని చేరుకోలేకపోతుంది.

కనుక సమాజంలో ప్రతి మనిషి తన కార్యాల ప్రకారం ప్రతి దినపు ప్రణాళిక చక్కగా రూపొందించుకోవాలి. ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు ఏమేమీ చేయాలో, తమ బాధ్యతలను ఎలా నిర్వర్తించుకోవాలో ఒక చక్కని ప్రణాళికను తయారు చేసుకోవాలి. దీనికోసం దైవప్రవక్త(స) గారి జీవితాన్ని అధ్యయనం చెయ్యాలి. దాని ద్వారా ఒక చక్కని ప్రణాళికా పద్ధతి మనకు లభిస్తుంది.




**విద్య** మనిషిని పరిపూర్ణంగా తీర్చిదిద్దే శక్తి. ఇది కేవలం పాఠశాల, కళాశాలలకే పరిమితం కాదు. జీవితంలోని ప్రతి అనుభవం కూడా విద్యే. పుస్తకాల ద్వారా వచ్చే విద్యతో పాటు, జీవనానుభవం ద్వారా పొందే జ్ఞానం కూడా సమానంగా విలువైనది. విద్య మన ఆలోచనా విధానాన్ని మార్చుతుంది, మనుషుల మధ్య సంబంధాలను మెరుగుపరుస్తుంది, మానవతా విలువల పట్ల గౌరవాన్ని పెంచుతుంది. విద్య ద్వారా మనిషి తనను తాను తెలుసుకుంటాడు, సమాజాన్ని అర్థం చేసుకుంటాడు, జీవిత లక్ష్యాలను సాధించేందుకు అడుగులు వేస్తాడు. అక్షరాస్యత విద్యలో మొదటి మెట్టు.

జ్ఞానం ద్వారా సమస్యలను విశ్లేషించే శక్తి పెరుగుతుంది. మంచి-చెడులను తార్కికంగా విడదీయగలగడం, సమాజంలో బాధ్యతతో జీవించడం, తన అభివృద్ధితో పాటు సమాజాభివృద్ధికి తోడ్పడడం All these are outcomes of true Education.

## జ్ఞానం - జీవితానికి మార్గదర్శకం

జ్ఞానం చీకటిలో దీపంలా ఉంటుంది. మానవ చరిత్ర చూస్తే జ్ఞానం గలవాళ్ళే మహానుభావులయ్యారు. ఆధ్యాత్మికంగా చూస్తే, "సత్యమేవ జయతే" అనే నినాదం విద్య ద్వారానే తెలిసేది. విజ్ఞానమే మనిషిని మూఢనమ్మకాల నుంచి బయటపడేస్తుంది. వ్యక్తిత్వాన్ని వికసింప చేస్తుంది, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది, ఉపాధిని పొందేందుకు మార్గం చూపుతుంది, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుంది, మనోధైర్యాన్ని పెంచుతుంది.

ఉదాహరణకు: డాక్టర్‌కు ఉన్న జ్ఞానం ప్రాణాలను రక్షించగలదు. రచయితకి ఉన్న విద్య సమాజాన్ని బతికిస్తుంది. శాస్త్రవేత్తకి ఉన్న అధ్యయనం ప్రపంచాన్ని సాంకేతికంగా అభివృద్ధి చేస్తుంది. విద్య మనిషిలో ఉన్న "పొగరు"ను తక్కువ చేసి, "స్వాభిమానాన్ని" పెంచుతుంది.

## అక్షరాస్యత

చదవగలగడం, రాయగలగడం ద్వారా వ్యక్తికి స్వేచ్ఛ, సాధికారత లభిస్తుంది. అక్షరాస్యత లేని వాడు నేటి డిజిటల్ ప్రపంచంలో వెనుకబడిపోతాడు.

**అక్షరాస్యత వల్ల :**

పిల్లలకు విద్య అందుతుంది

మహిళల సాధికారత సాధ్యమవుతుంది

ఆరోగ్యంపై అవగాహన పెరుగుతుంది

స్వయం ఉపాధికి అవకాశాలు అందుతాయి

ప్రజాస్వామ్యంలో చురుకైన పాత్ర పోషించగలుగుతారు

అక్షరాస్యత అంటే చదవడం, రాయడం మాత్రమే కాదు. అది సమాచారాన్ని గ్రహించడం, స్పందించడం, ఉపయోగించడం అనే సామర్థ్యాన్ని సూచిస్తుంది. అక్షరాస్యత ద్వారా వ్యక్తి తన హక్కులను తెలుసుకోగలడు, బాధ్యతలను నిర్వర్తించగలడు, తాను నివసించే సమాజానికి మంచి పౌరుడిగా మారగలడు.

## ప్రభావాలు

ఒక తల్లి అక్షరాస్యురాలు అయితే, కుటుంబం మొత్తం మారుతుంది. ఆమె ద్వారా పిల్లలకు చదువు మీద ఆసక్తి పెరుగుతుంది.

ఒక రైతు అక్షరాస్యుడు అయితే, తగిన పద్ధతుల్లో సాగు చేసి, మార్కెట్ ధరలు తెలుసుకొని, లాభాన్ని పెంచుకోగలడు.

ఒక యువకుడు అక్షరాస్యుడు అయితే, ఇంటర్నెట్ వనరులు ఉపయోగించి ప్రపంచంతో కలిసి నడుస్తాడు.

అక్షరాస్యత లేకపోతే వ్యక్తి సమాజంలో వెనుకబడిపోతాడు. కనుక దీనిని ప్రాథమిక హక్కుగా పరిగణించాలి.

## నేటి సమాజ అవసరం

చాలా మంది అక్షరాస్యతకు దూరంగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఈ విషయంలో తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అన్నీ కలసి అక్షరాస్యత కోసం పాటుపడాలి.

విద్య లేనిదే అభివృద్ధి లేదు

విద్య లేనిదే అభివృద్ధి ఊహించలేం. దేశం అభివృద్ధి చెందాలంటే, ప్రజలు చదువుతుండాలి. ఒక దేశ అగ్రగామిత్వం అక్కడి విద్యా ప్రమాణాల మీదే ఆధారపడి ఉంటుంది.

## భారతదేశం - ఒక అవలోకనం

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం విద్యాసంస్థల అభివృద్ధి జరిగింది. కానీ ఇంకా గ్రామీణ ప్రాంతాలలో అక్షరాస్యత వెనుకబడి ఉంది. కారణం; ఆర్థిక పరిస్థితులు, బాలకార్మికం, పాఠశాలల కొరత, తల్లిదండ్రుల అవగాహనా లోపం

అందుకే "సర్వ శిక్షా అభియాన్", "బేటీ బచావో బేటీ పడావో", "నిపుణ భారత్", "న్యూఎడ్యుకేషన్ పాలసీ 2020" వంటి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి.

## భవిష్యత్ దిశగా- మన బాధ్యత

విద్యను అందరికీ అందించాలంటే మనమందరం కలిసి పని చేయాలి. కేవలం ప్రభుత్వం కాకుండా, పౌరసమాజం, స్వచ్ఛంద సంస్థలు, యువత- అందరూ తమ వంతు కృషి చేయాలి. చిన్నారులకు విద్య అనుసంధానాన్ని పెంపొందించాలి. అక్షరాస్యతను ప్రతి ఇంటికి తీసుకెళ్లే బాధ్యత మనదే.

## ముగింపు

విద్య, జ్ఞానం, అక్షరాస్యత- ఇవన్నీ మనిషిని ఒక గొప్ప వ్యక్తిగా, సమాజాన్ని ఒక చైతన్యవంతమైన వేదికగా మారుస్తాయి. చదువు పొందిన ప్రతి వ్యక్తి జ్ఞానం ద్వారా మార్గదర్శిగా మారాలి. అక్షరాస్యత నివ్వని సమాజం తిరోగమనం బాటలోకి వెళ్తుంది. ప్రతి మనిషి విద్యను సొంతం చేసుకుని, సమాజ నిర్మాణంలో తన వంతు పాత్ర పోషించాలి. ఎందుకంటే- "విద్య వెలుగుతో జీవితాన్ని వెలిగించుకుందాం!"

ఇస్లాం ధర్మంలో విద్యకి అత్యంత గొప్ప స్థానం ఉంది. జ్ఞానం పొందడం ఒక ఎంపిక కాదు, అది ప్రతి ముస్లింకు విధిగా పరిగణించబడింది. విద్య లేని వ్యక్తి చీకటిలో జీవించే వ్యక్తి లాంటివాడు. అల్లాహ్ పంపిన మొదటి సందేశం కూడా "ఇఖ్రా"- చదువు అనే పదంతో మొదలైంది. ఇది విద్య ప్రాముఖ్యతను ఎంతగా వెల్లడిస్తున్నదో మనం అర్థం చేసుకోవచ్చు.

విద్య అనేది ఒక నిత్య అవసరం. అది మనిషిని జంతువుల స్థితి నుంచి ఉన్నత మానవీయ స్థాయికి తీసుకెళ్తుంది. ఈ విషయాన్ని ప్రపంచంలో ప్రతీ సంస్కృతి గుర్తించింది.

## హదీసులలో విద్య ప్రాధాన్యం

ప్రవక్త ముహమ్మద్ (స.అ) విద్య గురించి స్పష్టంగా, బలంగా పలికిన ఉపదేశాలివి:

"విద్యను పొందడం ప్రతి ముస్లిం పురుషునికీ, స్త్రీకీ విధి".

"జ్ఞానం కోసం ప్రయాణించినవారికి అల్లాహ్ స్వర్గం దారి సులభతరం చేస్తాడు." (అబూ దావూద్)

ఇస్లాం చరిత్రలో అనేక మంది జ్ఞానవేత్తలు, పండితులు, శాస్త్రవేత్తలు వెలుగు చూశారు. వారిలో కొందరు:

**ఇబ్నె సీనా** : వైద్య, తత్వశాస్త్రంలో విశేష కీర్తిని పొందినవారు

**అల్-ఖువారిజ్మి** : గణితంలో "ఆల్జీబ్రా" పితామహుడు

**ఇబ్నె హైసమ్** : ప్రకాశ శాస్త్రంలో పితామహుడు

**ఇబ్నె ఖల్దూన్** : చరిత్ర, సమాజ శాస్త్రంలో ఆధునిక ఆవిష్కర్త

ఈ విద్యామూర్తులు ఖుర్ఆన్, హదీస్ ప్రేరణతోనే చదువుపై ఆసక్తి పెంచుకున్నారు.

ఇస్లాంలో పాఠశాలలు, మదర్సాలు అక్షరాస్యతను పెంపొందించేందుకు ముఖ్యమైన పాత్ర పోషించాయి.

## నేటి అవసరం

పిల్లలను చదివించడంలో నిర్లక్ష్యం ఖుర్ఆన్, హదీస్ మార్గదర్శకాలకు వ్యతిరేకం.

పిల్లలకు ధార్మిక, ప్రాపంచిక విద్య రెండింటినీ అందించాలి

బాలికలను చదువుల్లో ప్రోత్సహించాలి

మదర్సాలనూ, మోడరన్ స్కూళ్లనూ సమన్వయంగా అభివృద్ధి చేయాలి.

కాబట్టి... చదువు మన హక్కు కాదు - అది మన విధి!

కథ

- షహనాజ్ బేగం, అనంతపురం



# పేదల ఇంట పండుగ

**అది బక్రీద్ పండుగ రోజు. మధ్యాహ్నం వేళ. బయట ఎండ చుర్రుమంటోంది. అమీరున్నిసా వడివడిగా తన ఇంటికేసి నడుస్తోంది. ఎంత తొందరగా ఇంటికి చేరుకోవాలని ఆత్రపడుతుందో అంత వేగంగా నడవలేకపోతోంది.**

వయసు మీద పడ్తోంది. ముది వయసు. డెబ్బై ఏళ్ళు దాటాయి. చూపు కూడా మందగించింది. తన జీవితంలో ఎదుర్కొంటున్న విపత్కర పరిస్థితులలో వయసుకంటే ఎక్కువగా శరీరం శుష్కించి పోయింది. వయో భారంతో భుజాలు వొంగిపోయాయి.

ఆమె చేతిలోని సంచి బరువుగా వుంది. అందులో బక్రీదు పండుగ సందర్భంలో ఇచ్చిన ఖుర్బానీ గోష్త్ (మాంసం) ఉంది. ఎప్పు డెప్పుడు ఇంటికి చేరుకుని ఆ మాంసం వండుకుని ఇంటిల్లిపాది పండుగ చేసుకోవాలా, కడుపారా పిల్లలకు పెట్టాలా అని ఉంది.

ఆమెది పెద్ద సంసారం. ఇంట్లో కొడుకు, కోడలు వారి పిల్లలతో పాటు భర్త వదిలేసిన కూతురు, ఆమె పిల్లలు ఉన్నారు. కూతురు ఎప్పుడూ ఏదో ఒక రోగంతో మంచాన పడి ఉండటంతో ఆమె భర్త రెండో పెళ్ళి చేసుకుని ఎటో వెళ్ళిపోయాడు.

కూతురు భారం కూడా ఆమెపైన పడింది. అమీరున్నిసా పేరులోనే 'అమీర్' కాని జీవితంలో కడు పేదరాలు.

ఆమె భర్త కూడా పిల్లలు చిన్నవయసులో ఉన్నప్పుడే తన సుఖం తాను చూసుకుని ఎటో వెళ్ళిపోయాడు. అప్పట్నుంచి ఆమె కాయకష్టం చేసుకుని పిల్లలను పెంచి పెద్ద చేసింది.

ఇప్పుడు తనకు తెలిసిన వారి ఇండ్లు తిరిగి ఖుర్బానీ మాంసాన్ని అడిగి తెచ్చుకుంటున్నది.

ఇంట్లో మాంసం రుచిచూడక చాలా కాలమయ్యింది. పొట్టేలు మాంసం కొందామంటే దాదాపు కిలో వెయ్యి రూపాయలు ధర పలుకుతోంది. ఇక తక్కువ ధరలకు ఏమీ దొరకడంలేదు. పప్పు, కూరగాయలు కొనడానికే కష్టమైపోతున్న ఈ రోజుల్లో అంత డబ్బులు పెట్టి మాంసాన్ని కొనే పరిస్థితుల్లో లేరు.

బక్రీద్ పండుగ కోసం ఎదురుచూడసాగారు. ధర్మాత్ములు, పుణ్యాత్ములు ఇచ్చే ఖుర్బానీ మాంసంతో పండగ చేసుకుని తృప్తిగా తినాలని.

తన చేతిలోని సంచిలో ఉన్న ఖుర్బానీ మాంసంతో కనీసం రెండు మూడు రోజులు గడిచిపోతాయని పిల్లలు కడుపారా తింటారని సంబరపడిపోసాగింది.

ఆమె కొడుకుది గంపెడు సంసారం. ఖర్చులు ఎక్కువ. రాబడి తక్కువ. ఏదో పని దొరికిన రోజున నాలుగు డబ్బులు తెస్తాడు. లేని రోజుల్లో పస్తులే. అందుకే ఈ వయసులో కూడా ఆమె కష్టపడక తప్పటం లేదు. అక్కడక్కడ కొన్ని ఇళ్ళల్లో వంట పనికి కుదిరింది. వాళ్ళిచ్చిన డబ్బును మిగిలిపోయిన పదార్థాలను ఇంటికి తెస్తుంటుంది.

ఇలా రోజులు గడిచిపోతున్నాయి.

ప్రస్తుతం తన శరీరంలో శక్తి ఉడిగి పోవడంతో ఎక్కువగా పని చెయ్యలేకపోతోంది. కానీ తన కుటుంబం కోసం పనిచెయ్యక తప్పడం లేదు.

అలా ఏదో ఆలోచనల మధ్యనే ఆమె ఇంటిని సమీపించింది.

ఆమెకు తన చెల్లెలు కూతురు జులేఖాబీ తన గుడిసెలాంటి ఇంటి ముందు దైన్యంగా కూర్చుని వుండగా కన్పించింది.

ఆమె జీవితం కూడా చాలా దుర్భరమైనది. తన బిడ్డలాంటిది. తల్లి లేని పిల్ల. ఆమెకు పెళ్ళీడు రాగానే రెండో పెళ్ళి వాడికిచ్చి పెళ్ళి చేశారు. అప్పటికే అతనికి ఇద్దరు పిల్లలు. భార్య చనిపోయింది. తరువాత ఆమెకు ఇద్దరు పిల్లలు కలిగారు. ఆ ఇంట్లో మొత్తం నలుగురు పిల్లలున్నారు. ఇప్పుడు మళ్ళీ గర్భం దాల్చింది.

పెళ్ళయిన నాటి నుంచే ఆమెకు కష్టాలు ప్రారంభమయ్యాయి. అతను తాగుబోతు. ఆటో నడుపుతాడు. తన సంపాదనలో ఎక్కువ భాగం త్రాగుడుకే ఖర్చుపెట్టి మిగతాది ఇంట్లో ఇస్తుంటాడు.

ఆమె అలాగే సంసారాన్ని నెట్టుకుని వస్తోంది. ఎదురు తిరిగితే పట్టుకుని కొడతాడు. పిల్లల కోసం, పరిస్థితుల దృష్ట్యా అలాగే సర్దుకుపోతోంది.

జులేఖాను చూసి అక్కడే ఆగిపోయింది అమీరున్నిసా.

“బేటీ, ఏమిటిలా కూర్చున్నావు. పండుగ చేసుకోలేదా. మీ ఆయన ఇంట్లోకి ఏమైనా తెచ్చాడా లేదా?” అని అడిగింది.

“లేదు ఖాలా. ప్రొద్దుననగా బయటికి వెళ్ళాడు. మనిషి అయిపు జాడ లేదు. ఎక్కడయినా త్రాగి పడిపోయాడేమో. పిల్లలు పలావు కావాలని ఖుర్మా కావాలని ఏడుస్తూ కూర్చున్నారు. నేనేమి చేసేది” అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

“నేను పండుగ రోజున పలావు మాంసం, ఖుర్మా చేసి పెడ్తానని పిల్లలకు చెప్పివుంటిని.. ఇప్పుడు వాళ్ళు అడుగుతున్నారు. కొన్ని బియ్యం వుంటే అన్నం వండాను. ఖుర్బానీ మాంసం అడగటానికి నేనెక్కడికీ బయటికి వెళ్ళలేదు. ఈ పిల్లలతో వీలుపడలేదు...” చెప్పుకొచ్చింది జులేఖాబీ.

అది విని ఆమె హృదయం ద్రవించిపోయింది. జులేఖాబీ ఆమె పిల్లలు ఆకలితో ఉండటం చూడలేకపోయింది. కానీ తన దగ్గర ఉన్న ఖుర్బానీ మాంసాన్ని ఇవ్వడానికి మనసొప్పలేదు. ఓ ప్రక్క తన కుటుంబీకులు గుర్తుకు వస్తున్నారు. మరోపక్క తన బిడ్డలాంటి జులేఖాబీ దీనావస్థ.

కానీ ఎప్పుడో విన్న ధార్మిక సందేశాలు, హితవులు గుర్తుకు వచ్చాయి.

పక్కింటివారు ఆకలితో ఉంటే తాను మాత్రం కడుపునిండా తినటం విశ్వాసం (ఈమాన్) ఉన్నవారికి తగదు అన్న హితవు గుర్తుకు వచ్చింది. వెంటనే తన చేతిలోని సంచిని క్రిందపెట్టి ఒక కవరులాంటిది తీసి అందులో ఉన్న మాంసాన్ని ఆమెకు అందజేసింది అమీరున్నిసా.

“ఇది తీసుకుని పిల్లలకు వండి పెట్టు” అని చెప్పింది.

అది చూసి జులేఖా కళ్ళు ఆనందంతో మెరిసిపోయాయి. ‘షుక్రియా ఖాలా’. ఈ పూట నా పిల్లలు తృప్తిగా భోజనం చేస్తారు. పండుగ జరుపుకుంటారు... అని చెబుతూ ఆ మాంసాన్ని తీసుకుని ఇంట్లోకి నడిచింది.

అమీరున్నిసా తన ఇంటి బాట పట్టింది. తన దగ్గర ఉన్న మాంసం తక్కువయినందుకు ఓ ప్రక్క మనసులో సలుపుతున్నా మరో ప్రక్క ఓ పేద కుటుంబం కడుపారా తింటున్నందుకు ఆనందమూ కలగసాగింది.

తన ఇంటికి చేరువయ్యింది. ఇంట్లో ఏదో హడావుడి కన్పించింది. అప్పటికే ఆమె కొడుకు ఎక్కణ్ణుంచో ఖుర్బానీ మాంసం తెచ్చినట్టున్నాడు. ఆ మాంసాన్ని ముక్కలు చేస్తూ కన్పించాడు. తాను పనిచేసే చోట ఆ యజమానులవారు ఇచ్చారని చెప్పాడు.

కోడలు మసాలాలు తయారు చేస్తోంది. మరోపక్క పెద్ద పొయ్యిని వెలిగిస్తున్నారు. ఆ మాంసంతోపాటు తాను తెచ్చిన మాంసం కలిపి పెద్ద వంటకమే తలపెట్టారు.

అక్కడంతా పండగ వాతావరణం కన్పించసాగింది. పిల్లలు, పెద్దలు ఆనందంతో కన్పించారు. ఇదంతా చూసి ఆనందాశ్చర్యాలతో మునిగిపోయింది అమీరున్నిసా.

రమజాన్ వచ్చినా, బక్రీద్ వచ్చినా పేదల ఇంట పండగే పండగ అనుకుంది. ఆ దైవాన్ని స్మరించుకుంటూ కృతజ్ఞతలు అర్పించుకుంది. పిల్లల చేత దుఆ చేయించింది. తన దగ్గర ఉన్న దాంట్లోనే ఓ పేద కుటుంబం కడుపు నింపినందుకు ఆ దైవం తనకు ఏమి తక్కువ చెయ్యలేదని తలచింది.

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# శ్రేయోభిలాషా! నీ పేరే ఇస్లామ్



- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి**

కోపం నిజాన్ని నిర్భయంగా చూడనివ్వదు, అహం ఆత్మ పరిశీలనకు అవకాశం ఇవ్వదు, వ్యసనం ధర్మాన్ని ఆచరింప నివ్వదు, దుర్గుణాల ప్రభావం దుష్ప్రభావాలకు చేరువ చేస్తాయి, ఆధ్యాత్మిక చింతన మాత్రమే మనసును ప్రభావితం చేస్తుంది. లక్ష్య సాధనకు నిబద్ధత అవసరం, ఆవేశం అదుపునకు ఆలోచన అవసరం, కలల సాకారానికి సంకల్పం అవసరం, అహం అదుపునకు సహనం అవసరం, ఆకలి తీర్చే ఔదార్యం, లోపం దిద్దే నైపుణ్యం, భేదం లేని సమభావం, కల్మషం లేని చిరునవ్వు - ఇవి మూర్తీభవించిన వ్యక్తిత్వం విలువలతో కూడిన సౌభ్రాతృత్వం అంటుంది ఇస్లాం.

మనం ఏ విధంగా ఆలోచిస్తామో అలానే మన మనోభావాలు కూడా సాగుతాయి. బుద్ధి సమస్య కాదు. బుద్ధిని సరిగా వినియోగించలేక పోవడమే అసలు సమస్య. మీకు చాలా వేగంగా నడిచే ఓ వాహనం ఇచ్చామనుకోండి. కానీ దాన్నెలా నడపాలో మీకు తెలీదు అనుకోండి. అప్పుడు మీరు దాన్ని నడపడం మీకు, మీ చుట్టూ వున్న వాళ్ళకి కూడా సమస్యే. ఎందుకంటే మీరు వాహనం నడిపే పద్ధతి నేర్చుకోలేదు కాబట్టి. అంతే గాని లోపం ఆ యంత్రంలో లేదు. మనిషి ధర్మాన్ని సరిగా పాటించడం లేదు అంటే ధర్మంలో ఎలాంటి తప్పు లేదు. మానవ శరీరం ఓ అద్భుతమైన సాధనం. ఈ సాధనంలో ఏ లోపం లేదు. కానీ ఈ అద్భుతమైన, ఆశ్చర్యకరమైన సాధనమే మనకు సమస్యగా మారింది. ఎందుకంటే మనం దాన్ని తెలుసుకోవడానికి గానీ, నియంత్రించడానికి గానీ ఎలాంటి ప్రయత్నం చేయలేదు.

వైఫల్యాలను అధిగమిస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, తప్పులను సరిదిద్దితే పరివర్తన కలుగుతుంది, మాటల్లో నమ్మకం కుదిరితే విశ్వసనీయత పెరుగుతుంది, వీటి ఆచరణ సాధ్యం చేస్తే వ్యక్తిత్వం విలువ పెరుగుతుంది. అందం ఆకారంలో కాదు, మనసులో ఉండాలి, మాట వెటకారంగా కాదు మృదువుగా ఉండాలి, నవ్వు వెకిలిగా కాదు వెలుగులా ఉండాలి, సంస్కారం చదువుతో కాదు ప్రవర్తనతో అబ్బుతుంది. ప్రయత్నిస్తే ఇవన్నీ ఆచరణలో సాధ్యమే. క్రోధం వచ్చినప్పుడు దృష్టి మరల్చుకో, మోహం కలిగినప్పుడు మనసు నియంత్రించుకో, అసూయ కలిగినప్పుడు ఆత్మ విమర్శ చేసుకో, ఆనందం కలిగినప్పుడు అందరితో పంచుకో- ఇవన్నీ ఆచరణ యోగ్యమే, కానీ ఈ సందర్భంగా చిత్తశుద్ధి అవసరం అంటుంది ఇస్లాం.

తమకుతాము ముస్లింలుగా ప్రకటించుకునే కొందరి పనులను బట్టిగాని, వారి ప్రవర్తనను బట్టిగాని ఇస్లాం ధర్మానికి ఆ పేరు రాలేదు. ఇస్లాం అనేది సత్యబద్ధమైన, స్పష్టమైన విశ్వాసాల, పూర్ణమైన, మహోన్నతమైన ధర్మ శాస్త్రాల, ఉన్నతమైన, సర్వాంగ సుందరమైన నైతికతల మేలిమి కలయిక. మానవ జీవితానికి సంబంధించిన సకల మేళ్లు కలిగిన సంపూర్ణ జీవన సంవిధానం. ఎవరైతే ఈ విశ్వాసాలను, నైతికతను, ధర్మశాస్త్ర అనుసరణను కలిగి ఉంటారో, వారు ముస్లింలుగా పరిగణింపబడతారు.

అలాంటప్పుడు ముస్లింల ప్రవర్తనను ఇస్లామీ సిద్ధాంతాల ఆధారంగానే తీర్పు చేయాలి.

ఎవరైనా సరే, తాము ముస్లింలమని చెప్పుకుంటూ, హింసాయుత కార్యకలాపాలకు పాల్పడితే, దానికి వారే బాధ్యులు తప్ప, అటువంటి వికృత చేష్టలతో, హింసాయుత ప్రవృత్తితో ఇస్లాం ధర్మానికి ఏమాత్రం సంబంధం లేదు. ఆ విషయానికొస్తే ప్రపంచంలోనే- పేరులో శాంతి గల ఏకైక ధర్మం ఇస్లాం. ఆ ధర్మాన్ని ప్రపంచ మానవాళికి అనుగ్రహించిన అల్లాహ్ నామాల్లోని ఓ నామం సలామ్ - శాంతి ప్రదాత. ఆ మానవతా ధర్మాన్ని విశ్వ జనావళికి చేరువ చేసిన ప్రవక్త- రహ్మతుల్ లిల్ ఆలమీన్- విశ్వ కారుణ్యమూర్తి, ఆయనపై అవతరించిన అంతిమ దైవ గ్రంథం ఖురాన్ పేర్లలో ఒక పేరు రహ్మాహ్- నిలువెత్తు కారుణ్యం. అది మానవాళిని ఆహ్వానించే స్వర్గవనం పేరు దారుస్సలామ్- శాంతి నిలయం. అది మనిషి ప్రాణానికిచ్చే విలువ ఎంత అద్భుతమైనదో ఒక్కసారి చూడండి!

ఈ (హత్య) కారణంగానే మేము ఇస్రాయీల్ సంతతివారికి ఇలా ఒక ఉత్తర్వు జారీచేశాం:

> **"ఎవరైనా ప్రతీకార హత్య(శిక్ష)గా లేక ధరణిపై కల్లోలం రేకెత్తించినందుకు శిక్షగా తప్ప ఏ మనిషినైనా చంపితే అతను యావత్తు మానవాళిని చంపినట్లే. అలాగే ఎవరైనా ఒక మనిషి ప్రాణం కాపాడితే అతను యావత్తు మానవాళిని కాపాడినట్లే." (ఈ ఆజ్ఞ జారీ చేసినప్పటికీ వారి పరిస్థితి మారలేదు) మా ప్రవక్తలు ఒకరి తర్వాత ఒకరు అనేకమంది వారి దగ్గరకు స్పష్టమైన హితోక్తులు తీసుకొచ్చారు. అయినా వారిలో ఇప్పటికీ అత్యధికమంది ప్రపంచంలో హద్దుమీరి ప్రవర్తించేవారే ఉన్నారు. (అల్-మాయిదహ్: 32)**

మానవ నాగరికతకు ప్రబల శత్రువుగా పరిణమించిన ఉగ్రవాదం మరోసారి తన పైశాచికత్వాన్ని ప్రదర్శించింది. షైతాన్ ప్రేరేపిత ముష్కర మూకల మృగోన్మాదంతో సుందర కశ్మీరం మళ్లీ నెత్తురోడింది. పన్నెండు రాష్ట్రాలకు చెందిన పదుల కొద్దీ యాత్రికులను కాల్చిచంపిన ఉగ్రవాదుల కిరాతకత్వం, వికృత మారణ కాండకు దిగిన ముష్కరుల రాక్షసత్వం- యావద్దేశాన్ని ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురిచేసింది.

ఇది కేవలం రాజకీయ సమస్య కాదు, ఇది మానవతా సంక్షోభం. ప్రశాంతంగా జీవించాలనుకున్న వారి హృదయాలను తుపాకులు ధ్వంసం చేశాయి. తీవ్రవాదానికి మతం లేదు, భౌగోళిక సరిహద్దులు లేవు. ఎక్కడ మనిషి ప్రాణం గణాంకంగా మారిపోతుందో, అక్కడ మన మౌనం కూడా నిశ్శబ్దమైన నేరంగా మారుతుంది. జాతి గౌరవం తుపాకీ ద్వారా కాదు, దయతో, మానవత్వంతో, బాధితుల పట్ల కలిగిన స్పందనతో నిలబడుతుంది. ఇది కన్నీటిని మాటలుగా, మౌనాన్ని పోరాటంగా మార్చే కాలం. కశ్మీర్ లోయలో ప్రగతి వనాలు విరబూయాలంటే ముందు అక్కడ శాంతి నెలకొనాలి.

ఇక ఉగ్రవాద దాడులను మతకోణంలో చూడడం, విద్వేషాన్ని మరింత పెంచేలా ప్రచారం చేయడం దేశ భవిష్యత్తుకు మంచిది కాదు. ఉన్మత్తత ఆవహించిన ఉగ్రవాదానికి, మతోన్మాదానికి మతమూ, ప్రాంతమూ అన్న విచక్షణ ఉండదు. తమ ఉన్మాదానికి అడ్డొచ్చిన ప్రతి మనిషీ తమకు శత్రువుగానే కనిపిస్తాడు. ఉగ్రదాడిపై సమగ్ర దర్యాప్తు జరిపి, ముష్కరులను కఠినంగా శిక్షించాలి. వైఫల్యం పునరావృతం కాకుండా తగు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో మతం పేరిట ఉగ్రవాదం విలయతాండవం చేస్తుండగా ధర్మాన్ని విశ్వసించేవారు మౌనంగా ఉండడం భావ్యం కాదు. అసహనం, అతివాదం, హింస ధర్మ విరుద్ధమైనవి, ఏ మతమూ ఆమోదించని దుష్టవర్తనలవి.

ప్రపంచం ఏవిధంగా రూపొందించబడిందంటే, ఇక్కడ అనేక సార్లు మనిషి అవాంఛనీయ సంఘటనలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఈ ప్రపంచం పరీక్షాలయం అవడంచేత ఇదంతా తప్పదు మరి. అవాంఛనీయమైన పరిస్థితుల్లో సయితం సకారాత్మకంగా ప్రతిస్పందించే వ్యక్తి మాత్రమే స్వర్గానికి అర్హుడు. మరెవరయితే నకారాత్మక భావాలకు నిలయమయ్యాడో అతను స్వర్గంలో ప్రవేశించే అర్హతను కోల్పోయాడు. ఇంకా స్వర్గంలో ప్రవేశించే వారెలా ఉంటారంటే, వారు ఆపద సమయాలలో నిస్పృహ చెందకుండా, ఖేదపడకుండా ఓర్పు వహిస్తారు. సంయమనంతో విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటారు. ఎవరి వల్లనయినా తమకు బాధ కలిగినా వారిని శపించరు సరికదా దీవిస్తారు. ఎవరితోనయినా వ్యవహారం చేయవలసివస్తే న్యాయబద్ధంగా వారి హక్కులను నిర్వర్తిస్తారు. ఎవరయినా తమను విమర్శిస్తే ఆగ్రహోదగ్రులవకుండా ప్రశాంత మనస్సుతో వింటారు. సద్విమర్శను సహృదయంతో స్వీకరిస్తారు. ఒకరిపట్ల తమకు ఎన్ని ఫిర్యాదులున్నాసరే అతని పట్ల న్యాయ దృష్టితోనే మెలగుతారు. ఎవరితోనయినా వారు ఏదయినా వ్యవహారం చేయవలసి వస్తే ఎదుటివారు వీరిని సదాచార. సంపన్నులని గుర్తించేలా మెలగుతారు. ఆఖరికి ఎదుటివారి కొరకు వికృత వైఖరి, వేలం వెర్రి మూలంగా తమలో ద్వేషం, ప్రతీకార భావం పెల్లుబికినప్పటికీ దాన్ని వారు దిగమ్రింగి తమ వ్యతిరేకతను

శ్రేయోభిలాష రూపంలో ప్రదర్శిస్తారు. వారు ప్రాపంచిక జీవితంలో దేవుని పుష్పంలా మారిపోతారు. ఆ పువ్వు నుండి సుగంధపరిమళం వెదజల్లబడుతుంది. బడాలి కూడా.

వారు కలిమిలోనూ, లేమిలోనూ తమ సంపద (దైవమార్గంలో)ను ఖర్చు పెడతారు. కోపాన్ని దిగమింగుతారు. ఇతరుల తప్పులు క్షమిస్తారు. ఇలాంటి సద్వర్తునులనే అల్లాహ్ ప్రేమిస్తాడు. అదీగాక అల్లాహ్ తప్ప మరెవరూ పాపాలు క్షమించేవారు లేరు గనక తమవల్ల ఏదైనా నీతిమాలిన పనిగాని, లేదా మరేదైనా పాపకార్యంగాని జరిగితే వెంటనే వారు అల్లాహ్‌ను స్మరించి క్షమాపణ చెప్పుకుంటారు. అంతేగాని, తాము చేసిన దానిపై మంకుపట్టు పట్టరు. అలాంటి వారికి ప్రతిఫలంగా వారి ప్రభువు నుండి మన్నింపుతో పాటు సెలయేరులు పారే స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడే వారు కలకాలం (హాయిగా) ఉంటారు. మంచి పనులకు ఎంత మంచి ప్రతిఫలం లభిస్తుంది!

(ఆలె ఇమ్రాన్: 134-136)

లోకంలో మంచీ చెడూ రెండూ ఉంటాయి. ఒకదానికొకటి అడ్డు తగులుతూ ఉంటాయి. కోకిల గానం కాకులకు కర్ణకఠోరంగా ఉంటుంది. హంస రూపాన్ని చూసి కొంగలు పరిహసిస్తూ ఉంటాయి. అంతమాత్రాన కోకిలకైనా హంసకైనా పోయేదేమీ లేదు. మనమూ దుర్విమర్శలకు ఏమాత్రం లొంగకూడదు. సత్యాన్ని తెలుసుకోవాలి. విజయాన్ని సాధించాలి. కర్తవ్య నిర్వహణకు కావాల్సిన శక్తిని సంపాదించుకోవాలి. సుఖశాంతులు కావాలని మనం కోరుకుంటాం. అవి ఎక్కడి నుంచి వస్తాయి? మన మనోనిగ్రహం నుంచే లభిస్తాయి. ఆ మనోనిగ్రహాన్ని దివ్య ఖుర్‌ఆన్ మనకిస్తుంది. మాటలు, చేతలు, ఆలోచనలు, గుణం, హృదయం- వ్యక్తిత్వానికి కీలకమైన ఈ అయిదింటిని యువతరం ఎప్పటికప్పుడు పుణికిపుచ్చుకోవాలి. అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలి. అలా మంచి పౌరులుగా తమను తాము తీర్చిదిద్దుకుని సమాజానికి సేవ చేయాలన్నది, దేశాన్ని ప్రగతి పథాన నడిపించాలన్నది, దేశ రక్షణకై ధర్మ పరిరక్షణకై ప్రాణాలను సయితం తృణప్రాయంగా అర్పించేయాలన్నది మనందరి ఆశ, ఆశయం అవ్వాలి. అంతిమంగా- మనసుల్ని గెలవాలి.. మానవత్వాన్ని బతికించుకోవాలి!

**(సమాప్తం)**

# ప్రేమాభిమానాలతో సహకరించుకోవాలి

ప్రతీ ముస్లిం సమాజమనే నిర్మాణంలో ఇటుక లాంటి వాడు. అందుకే దైవప్రవక్త (సల్లం) విశ్వాసులు పరస్పర కట్టడం లాంటి వారని... వారు ఒకరికొకరు ఊతంగా, ప్రేమ వాత్సల్యాలు కలిగి ఉంటారని తెలిపారు. నిజానికి వారంతా ఒక శరీరం లాంటివారు. అందులో ఏ అవయవానికి దెబ్బ తగిలినా మిగతా శరీరమంతా బాధను అనుభవిస్తుంది. ప్రతి ముస్లిం తోటి ముస్లింలపై ప్రేమాభిమానాలతో పాటు దయ చూపి, వారికి అవసరమైన సహకారం అందించాలి. నమాజ్‌కు సారథ్యం వహించే వ్యక్తి అక్కడున్న వారిలో పిన్నలు, వ్యాధిగ్రస్థులు, ముసలివారు ఉంటే వారిని దృష్టిలో పెట్టుకొని నమాజును సంక్షిప్తంగా చేయించాలి. తన అనుచరుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్విరామంగా ఉపవాసాలు పాటించొద్దని వారిని ఆదేశించారు. ప్రతి ముస్లిం తాను తోటి ముస్లింకు సోదరుడని భావించాలి. ఇలాంటి భావన ఉన్నవారు పరస్పరం ఒకరి అవసరాల్లో ఒకరు సహకరించుకొంటారని దైవప్రవక్త(స) ఏనాడో చెప్పారు. తోటి ముస్లింకు వచ్చిన కష్టాన్ని తొలగించిన వారికి ప్రళయ దినాన వచ్చే కష్టాన్ని అల్లాహ్ తొలగిస్తాడు. కాబట్టి దైవ ప్రవక్త ఆదేశాల మేరకు ముస్లింలంతా ఒకరిపై ఒకరు దౌర్జన్యానికి, మోసానికి పాల్పడకుండా స్నేహ సహకారాలతో కలిసి మెలిసి ఉండాలి. తోటి ముస్లింలను ఎన్నడూ నిస్సహాయ స్థితిలో వదిలేయకూడదు. ‘నీ సోదరుడు దౌర్జన్యం చేసేవాడైనా, పీడితుడైనా అతనికి సహాయం చెయ్యి’ అని ప్రవక్త ఆదేశించారు. అంటే దౌర్జన్యం చేసే వ్యక్తిని ఆ పని చేయకుండా ఆపడమే మనం అతడికి చేసే సాయం కావాలనేది ఆయన బోధన పరమార్థం. సలాం చెప్పినవవారికి ప్రతి సలాం చేయడం, మన పరిచయస్థుల్లో రోగాలతో బాధ పడుతున్న వారిని పరామర్శించడం, తెలిసిన వ్యక్తి శవ యాత్రకు హాజరవ్వడం, ఆప్తుల శుభ కార్యాల ఆహ్వానాలను అంగీకరించడం, తుమ్మినప్పుడు ఇస్లాం సూచించిన జవాబు చెప్పడం, ఇతరులు మన మంచిని ఆశిస్తే తిరిగి వారి బాగును కోరుకోవడం ప్రతి ముస్లింకు ఉన్న ఆరు హక్కులు. ఇవి ముస్లింల మధ్య ప్రేమానుబంధాలన్ని బలోపేతం చేస్తాయి.

**- అర్షియా**

# టీ తాగాల్సిందే?

ఆయూబ్ బాషా, నంద్యాల





టీ ను ఆవిష్కరించింది చైనా
భారతదేశం నిలబెట్టింది పైనా
తప్పదు టీ తాగాల్సిందే

గరం ఎంతైనా
నగరం ఏదైనా
తప్పదు టీ తాగాల్సిందే

ఋతువులెన్ని తిరిగినా
యుగాలెన్ని మారినా
తప్పదు టీ తాగాల్సిందే

అమీరైనా గరీబైనా ఫకీరైనా
కార్మికుడైన కర్షకుడైన అధికారైనా
తప్పదు టీ తాగాల్సిందే

బద్ధకం వీడాలన్నా
బుద్ధిగా చదవాలన్నా
తప్పదు టీ తాగాల్సిందే

నిద్రను తరమాలన్న
బుర్రకు ఉత్తేజం కావాలన్న
తప్పదు టీ తాగాల్సిందే

నిశీధిలో ఉషోదయం రావాలన్నా
ఉషోదయాన ఉత్సాహంగా ఉండాలన్నా
తప్పదు టీ తాగాల్సిందే

సమావేశమేదైనా
సమాలోచనేదైనా
తప్పదు టీ తాగాల్సిందే

వినోదమైనా, విషాదమైనా
విహారమైనా, ఆహారం తర్వాతైన
తప్పదు టీ తాగాల్సిందే

పలకరింపులైనా, సంప్రదింపులైనా
శుభాకాంక్షలైనా, బుజ్జగింపులైనా
తప్పదు టీ తాగాల్సిందే

వేదిక ఎక్కడైనా
వేడుక ఏదైనా
తప్పదు టీ తాగాల్సిందే

తాగందే కొద్దిగైనా
గడవదు పొద్దైనా
తప్పదు టీ తాగాల్సిందే

డాక్టర్లు వారించినా
అందరితో వాదించైనా
తప్పదు టీ తాగాల్సిందే




## పలస్తీనాకు దేశవ్యాప్తంగా సంఘీభావం

పలస్తీనాకు దేశవ్యాప్తంగా సంఘీభావం లభించింది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి గల్లీ వరకు ఇజ్రాయిల్ దురాక్రమణపై ప్రజలు గొంతెత్తారు. పలస్తీనాలో చిన్నారులు, మహిళలపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ చర్యలను ఖండించారు. ఇజ్రాయిల్ క్రూరమైన దాడులపై మోడీ ప్రభుత్వం మౌనం వీడాలని, బాధిత పలస్తీనా పట్ల మానవీయతను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్, సీజీపీఐ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా పలస్తీనా సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో వామపక్షాల ఆధ్వర్యంలో పలస్తీనాకు సంఘీభావంగా భారీ ర్యాలీ నిర్వహించారు. త్రిపుర రాజధాని అగర్తలాలో "యుద్ధం వద్దు, శాంతి కావాలి" అంటూ భారీ ప్రదర్శన చేపట్టారు. రాజస్థాన్‌లోని జైపూర్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిరసనలు జరిగాయి. ఒడిశాలోని భువనేశ్వర్‌తో పాటు వివిధ జిల్లాల్లో ప్రదర్శనలు జరిగాయి. బీహార్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఉత్తరప్రదేశ్‌లో వామపక్షాలు మానవహారం నిర్వహించాయి. పంజాబ్‌లో సీపీఐ(ఎం) నేతలు, కార్యకర్తలు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు జరిగాయి. జమ్మూకశ్మీర్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో కేంద్ర కమిటీ సభ్యులు యూసఫ్ తరిగామి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వివిధ ప్రాంతాల్లో పలస్తీనా సంఘీభావ కార్యక్రమాలు జరిగాయి. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ సంఘీభావ సభ జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ మాట్లాడుతూ ఇజ్రాయిల్‌ను ఒక మోసపూరిత రాజ్యంగా పేర్కొన్నారు. దాని అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు పొందిన ఉగ్రవాది అని ధ్వజమెత్తారు.

## మతాంతర వివాహాల్లో రాష్ట్రాల జోక్యం తగదు



ఇద్దరు వేర్వేరు మతాలకు చెందిన వ్యక్తులు వివాహం చేసుకుంటే దేశంలోని పలు రాష్ట్ర ప్రభుత్వాలు వారి పట్ల కఠిన వైఖరితో వ్యవహరిస్తున్నాయి. దీని కోసం కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలు ఏకంగా చట్టాలు రూపొందించాయి. మతాంతర వివాహాలను అడ్డుకోవడమే ఉద్దేశంగా ఈ చట్టాలు రూపొందాయి. అయితే సుప్రీం కోర్టు ఇటీవల ఒక కీలక తీర్పు వెలువరించింది. ఇద్దరు మైనర్ తీరిన వ్యక్తులు ఇష్టపూర్వకంగా చేసుకున్న మతాంతర వివాహాల్లో ఏ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేసింది. ఒక హిందూ మహిళను వివాహం చేసుకున్నందుకు దాదాపు ఆరు నెలలు జైలులో ఉన్న ముస్లిం వ్యక్తికి సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అంతకుముందు ఈ కేసులో ఉత్తరాఖండ్ హైకోర్టు సదరు ముస్లిం వ్యక్తికి బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. హైకోర్టు తీర్పును రద్దు చేస్తూ.. సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో జస్టిస్ బీ వీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ విచారణ చేపట్టింది. ఈ దంపతులు తమ కుటుంబాల ఇష్టంతో వివాహం చేసుకున్నందున, వారు కలిసి జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి అభ్యంతరం చెప్పకూడదని పేర్కొంది. "ఈ పరిస్థితుల్లో, ఈ వ్యక్తికి బెయిల్ మంజూరు చేయడం తగిన చర్య. క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, ఈ దంపతులు తమ ఇష్టప్రకారం కలిసి జీవించడానికి ఎటువంటి అడ్డంకి ఉండకూడదు" అని కోర్టు జారీ చేసిన ఆదేశంలో తెలిపింది.

## 9 నెలల్లోనే జనాభా లెక్కలు రెడీ

జనాభా లెక్కల ప్రక్రియ 2027 మార్చి 1న మొదలవుతుందని కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే. అధునాతన టెక్నాలజీ సాయంతో డిసెంబరుకల్లా కొత్త లెక్కలు అందుబాటులోకి వచ్చేస్తాయని కేంద్రం ధీమా వ్యక్తం చేస్తోంది. గత ప్రక్రియల కంటే నవీన రీతిలో జరగబోతోందని.. డేటా సేకరణకు మొబైల్ యాప్స్, రియల్‌టైం ప్రాసెసింగ్‌కు నిఘా వ్యవస్థలను వినియోగించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. జనాభా లెక్కలు మొదలైన తేదీ నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లా, తాలూకా/మండల స్థాయిల్లో జనగణన వివరాల ప్రచురణకు 9 నెలల సమయం తీసుకునే అవకాశముందని తెలిపాయి. 2011లో చేపట్టిన జనగణనలో సదరు వివరాలు ప్రచురించేందుకు రెండేళ్లకు పైనే పట్టిందని పేర్కొన్నాయి.




## ప్రపంచ లింగ వ్యత్యాస సూచీలో భారత్‌కు 131వ స్థానం

స్త్రీ పురుష సమానత్వం సాధించడంలో మన దేశం ఏటేటా వెనకబడుతూనే ఉంది. మహిళలు, పురుషుల మధ్య అవకాశాల్లో అంతరాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆర్థిక భాగస్వామ్యం నుంచి రాజకీయ సాధికారత వరకు ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. 148 దేశాలకు సంబంధించి ప్రకటించిన లింగ వ్యత్యాస సూచీ ర్యాంకుల్లో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది 129వ స్థానంలో ఉంది. రాజకీయ సాధికారత, ఆర్థిక భాగస్వామ్యం విషయంలో గణనీయమైన మార్పులతో బంగ్లాదేశ్ తన ర్యాంకును 75 స్థానాలు మెరుగుపరుచుకుని 25వ ర్యాంకుని దక్కించుకుంది. మాల్దీవులకు 138వ ర్యాంకు దక్కగా, సూచీలో అట్టడుగున 148వ స్థానంలో పాకిస్థాన్ నిలిచింది. ఇక వరుసగా 16వ ఏడాది కూడా ఐస్‌ల్యాండ్ అగ్రస్థానంలో కొనసాగుతోంది.

## ప్రపంచంలోనే బెస్ట్ సిటీ ఇదే..!

ఎకానమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (EIU) విడుదల చేసిన జాబితా ప్రకారం, డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్ 2025 సంవత్సరానికి ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా ఎంపికైంది. ఆరోగ్య సంరక్షణ, విద్య, స్థిరత్వం, మౌలిక సదుపాయాలు, పర్యావరణం వంటి అనేక ముఖ్యమైన అంశాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా 173 నగరాల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. అయితే, గత మూడు సంవత్సరాలుగా అగ్రస్థానంలో ఉన్న వియన్నాను కోపెన్ హాగన్ అధిగమించింది. వియన్నాతోపాటు స్విస్ నగరమైన జ్యూరిచ్ రెండవ స్థానంలో నిలిచాయి. థర్డ్ ప్లేస్‌లో ఆస్ట్రేలియాకు చెందిన మెల్‌బోర్న్, స్విట్జర్లాండ్‌కు చెందిన జెనీవా ఉన్నాయి. ఆస్ట్రేలియాలోని సిడ్నీ ఏడవ స్థానం నుండి ఈసారి ఆరవ స్థానంలోకి వెళ్లింది. ఈ సంవత్సరం ఆక్లాండ్, న్యూజిలాండ్, జపాన్‌లోని ఒసాకా ఏడవ స్థానంలో నిలిచాయి. టాప్ 10లో నిలిచిన మూడవ ఆస్ట్రేలియా నగరం అడిలైడ్, ఈసారి 9వ స్థానంలో నిలిచింది. కెనడాలోని వాంకోవర్ 10వ స్థానంలో నిలిచింది. 2024లో ఐదవ స్థానంలో నిలిచిన కెనడాకు చెందిన కాల్గరీ, ఈ సంవత్సరం టాప్ 10 నుండి 18వ స్థానానికి పడిపోయింది. సౌదీ అరేబియాలోని పర్షియన్ గల్ఫ్ లోని అల్ ఖోబర్ 148వ స్థానం నుండి 135వ స్థానానికి చేరుకుంది. జాబితాలో అట్టడుగున ఉన్న నగరాలు గత సంవత్సరం లాగే ఏ మాత్రం మారలేదు.

## ప్రపంచంలో బడికెళ్లని పిల్లలు 27.2 కోట్లు

ప్రపంచవ్యాప్తంగా పాఠశాలకు వెళ్లని పిల్లల సంఖ్య ప్రస్తుతం దాదాపు 27.2 కోట్లుగా ఉందని ఐక్యరాజ్యసమితికి చెందిన యునెస్కో గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ టీమ్ (జీఈఎం) తాజా నివేదిక పేర్కొంది. ఇది గత అంచనాల కంటే 2.1 కోట్లు ఎక్కువని తెలిపింది. ప్రాథమిక పాఠశాల వయస్సు పిల్లల్లో 11 శాతం మంది (7.8 కోట్లు), లోయర్ సెకండరీ స్కూల్ వయస్సు కౌమార దశ పిల్లల్లో 15 శాతం మంది (6.4 కోట్లు), అప్పర్ సెకండరీ స్కూల్ వయస్సు వాళ్లలో 31 శాతం మంది (13 కోట్లు) పాఠశాలకు దూరంగా ఉన్నారని వెల్లడించింది. పాఠశాలకు వెళ్లని పిల్లల పెరుగుదలకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని పేర్కొంది. 80 లక్షల మంది (38 శాతం) పెరుగుదలకు కొత్త ఎన్‌రోల్‌మెంట్, అటెండెన్స్ డేటా లేకపోవడం కారణమని పేర్కొంది. మరోవైపు అప్‌డేట్ చేసిన యూఎన్ జనాభా అంచనాల కారణంగా మరో 1.3 కోట్ల మంది (మిగతా 62 శాతం) పెరిగారని, ఇది మరొక కారణమని తెలిపింది.

## అణ్వాయుధాలను పెంచుకుంటున్న ప్రపంచ దేశాలు

మరో ప్రపంచ యుద్ధం ముంచుకొస్తున్న వేళ, ప్రపంచ దేశాల మధ్య అణ్వాయుధ పోటీ తీవ్రమవుతున్నది. ఆయా దేశాలు తమ అణ్వాయుధ సంపత్తిని పెంచుకుంటున్నాయి. చైనా గత రెండేండ్లలోనే ఏకంగా 100 అణు వార్ హెడ్‌లను తన అమ్ములపొదిలోకి చేర్చుకున్నట్టు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిప్రి) తన తాజా నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం చైనా వద్ద కనీసం 600 వార్‌హెడ్‌లు ఉన్నట్టు తెలిపింది. ఆయుధ నియంత్రణ విధానాలు బలహీనపడుతున్న ప్రస్తుత సమయంలో ప్రమాదకరమైన కొత్త అణ్వాయుధ పోటీ ఉద్భవిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా, రష్యా, యూకే, ఫ్రాన్స్, చైనా, ఇండియా, పాకిస్థాన్, ఉత్తరకొరియా, ఇస్రాయిల్ వంటి 9 అణ్వాయుధ దేశాల్లో దాదాపు అన్నీ 2024లో తీవ్రమైన అణ్వాయుధ ఆధునికీకరణ కార్యక్రమాలను కొనసాగించాయని, ఇప్పటికే ఉన్న ఆయుధాలను అప్‌గ్రేడ్ చేసి కొత్త వెర్షన్లను జోడించాయని సిప్రి నివేదిక పేర్కొన్నది. 2035 నాటికి చైనా 1500 అణ్వాయుధాలను సమకూర్చుకోవాలని అనుకుంటున్నట్టు నివేదిక వెల్లడించింది.

# ధర్మ జ్ఞానం విలువ!

ముహమ్మద్ వహీదుద్దీన్, సిద్దిపేట

**ధార్మిక జ్ఞానం** అంటే అల్లాహ్, దైవప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం ఉపదేశాలు, ఖుర్ఆన్ వెలుగులో, దైవప్రవక్త అడుగుజాడల్లో నడిస్తే ధార్మికంగా అల్లాహ్ మనల్ని ఉన్నత స్థాయిలో నిలబెడుతాడు.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలిపాడు:

**వీరిని అడుగు, తెలిసినవారూ, తెలియని వారూ ఇద్దరూ ఎప్పుడైనా సమానులు కాగలరా? బుద్ధిమంతులు మాత్రమే హిత బోధను స్వీకరిస్తారు. (అజ్ జుమర్ 39:9)**

**దివ్య ఖుర్ఆన్‌లో మరొకచోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు. (అల్ ముజాదలహ్ 58:11)**

ఇద్దరు ధర్మ జ్ఞాన సంపన్నుల గురించి తెలుసుకుందాం–

ఖలీఫా హారూన్ రషీద్ ఒకసారి తన సైన్యంతో అట్టహాసంగా ఒక నగరంలో బస చేసి ఉన్నారు. ఆ సమయంలో యాదృచ్ఛికంగా ఆ నగరానికి హదీసు విద్వాంసులైన హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ముబారక్(ర) కూడా అక్కడికి వచ్చారు. ఆయన గారు ఇంకా ఆ నగరానికి చేరుకోక మునుపే ఆయన వస్తున్నారనే వార్త నగరమంతా వ్యాపించింది. అక్కడి ప్రజలు సంతోషంతో, గౌరవంతో తండోప తండాలుగా ఆయనకు స్వాగతం పలకటానికి నగరం బయటకు బయలుదేరారు. ఆయనతో కలవాలనే, ఆయనను ప్రత్యక్షంగా చూడాలనే కోరిక వారిని అక్కడికి చేర్చింది. అందరికంటే ముందు తానే చూడాలని, తానే కలవాలని ప్రజలందరూ అక్కడ పోటీ పడుతున్నారు. ఖలీఫా హారూన్ రషీద్ గారి ఒక బానిస స్త్రీ ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యచకితురాలయ్యింది. ఏమిటీ, ఈ దృశ్యం అని అక్కడి వారిని అడిగింది. వారు ఇమామ్ గారు వస్తున్నారని, ఆయన్ని స్వాగతించటానికి వారు పోటీ పడుతున్నారని తెలియజేశారు. ఈ మాటను విన్న ఆమె నోట అకస్మాత్తుగా ఈ మాటలు వెలువడ్డాయి: దైవసాక్షిగా! అసలైన రాజు అంటే ఇమామ్ గారే. హారూన్ రషీద్ రాజు కోసమైతే ప్రజలు భయంతో వస్తారు. ఇక్కడైతే స్వచ్ఛందంగా ఒక చిన్నపాటి వార్త విని వస్తున్నారు.

★★★

మహా విద్వాంసులైన హసన్ బస్రీ(ర) తన జ్ఞానం కారణంగా ప్రజలలో ఎంతో ప్రాచుర్యం పొందారు. ప్రజలకు ఆయనంటే ఎంతో ప్రేమాభిమానాలు. బనూ ఉమయ్యాకు చెందిన క్రూరుడు, కఠినుడు అయిన హజ్జాజ్ బిన్ యూసుఫ్ బస్రా గవర్నరుగా ఉండేవాడు. ఒకరోజు అతడు ఖాలిద్ బిన్ సఫ్వాన్ ను 'బస్రా సర్దారు ఎవరు?' అని అడిగాడు. ఆయన తన పేరు చెప్పి తనను పొగుడుతాడని అతడు భావించాడు. కాని ఆయన దానికి భిన్నంగా హసన్ బస్రీ(ర) అని సమాధానమిచ్చారు. దానికి అతడు ఆశ్చర్యచకితుడై 'అదెలా? హసన్ బానిసల వంశానికి చెందినవాడు కదా!' అన్నాడు.

దానికి ఖాలిద్ నిర్భయంగా హసన్ బస్రీ ప్రజల నాయకుడు ఎందుకంటే, ధర్మం విషయంలో ప్రజలకు ఆయన అవసరం ఉంది. ప్రాపంచిక అవసరాల విషయంలో ఆయనకు ఎవరి అవసరమూ లేదు. దైవసాక్షిగా! బస్రాకు చెందిన గౌరవవంతుడు, ధనవంతుడు అయిన ప్రతి వ్యక్తి ఆయన గారు బోధించే సభలో హాజరవ్వటానికి కృషి చేస్తాడు. ఆయన గారి జ్ఞానంతో ప్రయోజనం పొందటానికి త్వరపడతాడు. ఆయన గారితో సన్నిహితంగా ఉండాలనే ఆశను కలిగి ఉంటాడు. ఈ విధంగా ఖాలిద్ బిన్ సఫ్వాన్ గారి నోటి ద్వారా హసన్ బస్రిగారి గురించి గౌరవప్రదమైన మాటలను వింటున్న హజ్జాజ్ అకస్మాత్తుగా తన నోటితో అసలైన నాయకుడు, అసలైన నాయకత్వం అంటే ఇదే అని ఎలుగెత్తి పలికాడు.

ఈ రెండు సంఘటనల ద్వారా జ్ఞానవంతులు, విద్వాంసులు అయిన వారి గౌరవం ఎటువంటిదో స్పష్టంగా అర్థమవుతోంది.

దైవప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: ధర్మ జ్ఞానం కల విద్వాంసులను అనుసరించండి. ఎందుకంటే వారు ఇహపర లోకాల కాంతి వంటి వారు. ధరణిపై ధార్మిక విద్వాంసులు ఆకాశంపై ఉన్న నక్షత్రాల వంటివారు. వాటి ద్వారా భూమిపైన, సముద్రాలలోనూ మార్గాన్ని పొందుతారు. ఒకవేళ నక్షత్రాలు మాయమైపోతే మార్గాన్ని పొందేవారు మార్గాన్ని తప్పిపోతారు. (హదీస్ గ్రంథం:ముస్నదె అహ్మద్)

ఎవరైతే జ్ఞానాన్ని ఆర్జించేందుకు మార్గం ఎంచుకుంటారో, అల్లాహ్ వారికి స్వర్గ మార్గాన్ని సులభతరం చేస్తాడు.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**